RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 19 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ గురువారం 23-04-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి

RNI No. APTEL/2012/53127

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



## దేశంలో భానుడి విశ్వరూపం..

2వ పేజీలో...

### ప్రపంచంలోని 20 అత్యంత వేడి నగరాల్లో 19 మనవే..!

ఢిల్లీ,: భారత్‌లో ఎండలు మండిపోతున్నాయి. దేశంలోని చాలా ప్రాంతాల్లో 43 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రస్తుతం పంచవ్యాప్తంగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలకు భారత్ కేంద్రంగా మారింది. ఏప్రిల్ 21నవిడుదల చేసిన డేటా ప్రకారం.. ప్రపంచంలోని 20 అత్యంత వేడినగరాల జాబితానుపరిశీలిస్తే అందులో 19 నగరాలు భారత్‌లోనే ఉన్నాయి. దేశంలోని ఉత్తర, మధ్య, తూర్పు ప్రాంతాల్లో ఎండలు మండిపోతున్నాయి. బీహార్‌లోని భాగల్‌పూర్, ఒడిశాలోని తాల్చేర్, పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నగరాల్లో 44డిగ్రీల సెల్సియస్‌ఉష్ణోగ్రతతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాయి. వీటితోపాటు బీహార్‌లోని బెగుసరాయ్, మోతిహారి, ముంగేర్, భోజ్‌పూర్, సివాన్‌లతోపాటుపశ్చిమబెంగాల్,తూర్పుఉత్తరప్రదేశ్‌లోని పలుప్రాంతాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



వాయిదాల్లో ఓటుకు నోటు కేసు విచారణ

రెండు వారాలకు వాయిదా వేసిన

## సుప్రీంకోర్టు

2వ పేజీలో...

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22 : ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును మరో రెండు వారాల తర్వాత విచారిస్తామని తెలిపింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ విజయ్ బిష్ణోయ్ కూడా సభ్యుడిగా ఉన్నారు. మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. ముఖ్యంగా ఈ కేసులో రెండు కీలక పిటిషన్లు విచారణకు వచ్చాయి. ఒకటి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ కాగా, మరొకటి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కీలక నేత సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసినది. సీఎం రేవంత్ రెడ్డి తన పిటిషన్‌లో ఓటుకు నోటు కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా ఎన్నికల చట్టాల ప్రకారమే విచారించాలని కోరారు.



2వ పేజీలో...

## అమెరికా-ఇరాన్ చర్చల్లో ప్రతిష్టంభన

### ఉపాధ్యక్షుడి పాక్ పర్యటన వాయిదా

- పాకిస్థాన్‌లో జరగాల్సిన అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు వాయిదా
- ఇరాన్ నుంచి స్పష్టత రాకపోవడంతో అమెరికా ఉపాధ్యక్షుడి పర్యటన నిలిపివేత
- పాకిస్థాన్ విజ్ఞప్తి మేరకు కాల్పుల విరమణను పొడిగించిన అధ్యక్షుడు ట్రంప్
- అయితే హర్మూజ్ జలసంధిలో నౌకా దిగ్బంధనం కొనసాగుతుందని స్పష్టీకరణ
- దిగ్బంధనం ఎత్తివేస్తేనే చర్చలని తేల్చిచెప్పిన ఇరాన్



2వ పేజీలో...

## హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

కాళేశ్వరం అవినీతి విచారణలో సర్కార్ విఫలం

అవకతవకలపై ఇన్నేళ్లయినా చర్యలు లేవు

ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెట్టిన హైకోర్టు తీర్పు

విమర్శలు గుప్పించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్ 22 : కాళేశ్వరం అవినీతి విచారణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి బుధవారం తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం వల్ల, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపితమైందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని కిషన్‌రెడ్డి విమర్శించారు.



2వ పేజీలో...

## ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

### హైకోర్టు తీర్పుపై మాజీమంత్రి హరీష్ రావు

హైదరాబాద్, ఏప్రిల్22 :ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైందని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పీసీ ఘోష్ నివేదికపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మాజీ మంత్రి స్పందించారు.



2వ పేజీలో...

## సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

వెంటనే సమ్మె విరమించి రండి

ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి



2వ పేజీలో...

## కాళేశ్వరం ప్రాజెక్టుపై.. కెసిఆర్,హరీష్‌లకు ఊరట

### జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను నిలిపివేసిన హైకోర్టు



## కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్

- స్పష్టమైన ప్రతిపాదనతో రావాలని ఇరాన్‌కు సూచన
- ట్రూత్ సోషల్ మీడియాలో వెల్లడించిన అధ్యక్షుడు

వాషింగ్టన్, ఏప్రిల్22 : ఇరాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇరుదేశాల మధ్య గతంలో కుదిరిన కాల్పుల విరమణను పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ నాయకత్వం ఒక సమగ్ర ప్రతిపాదనను సమర్పించే వరకు ఈ కాల్పుల విరమణ కొనసాగుతుందని తెలిపారు. అమెరికా, ఇరాన్ మధ్య ఈ నెల 8వ తేదీన కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. రెండు వారాల ఈ సీజ్ ఫైర్ మరో కొద్ది గంటల్లో ముగియనుందనగా ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అయితే, పాకిస్థాన్ నుంచి వచ్చిన అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించినట్లుగా ట్రంప్ తెలిపారు. ముఖ్యంగా పాక్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ల అభ్యర్థన మేరకు సైనిక చర్యను వాయిదా వేసి, దౌత్య చర్చలకు అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లుగా పేర్కొన్నారు. ఈ మేరకు తన ట్రూత్ సోషల్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. అయితే, సీజ్‌ర్ కొనసాగుతున్న సమయంలోనే ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని కొనసాగించాలని సైన్యానికి ఆదేశాలు ఇచ్చినట్లుగా ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు తీవ్రంగా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వారు ఏకీకృత ప్రతిపాదనతో రావడానికి సమయం అవసరం. అందుకే ఈ దాడిని నిలిపివేసి, సీజ్÷ర్ పొడిగించాం అని తెలిపారు. బ్లాకేడ్ కొనసాగించాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై ఇరాన్ మండిపడింది. ఇది కాల్పుల విరమణకు వ్యతిరేకమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అర్ఘాచీ విమర్శించారు.



2వ పేజీలో...

## సైబర్ నేరాలు పెరుగుతున్న వేళ బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం

### ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రాకు సిపి సజ్జనార్ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్22 : సైబర్ నేరాలను అరికట్టాలంటే బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరమని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సైబర్‌ముఠాలకు 'మ్యూల్ అకౌంట్లు' వరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నగర పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ ఆక్టోపస్' దర్యాప్తులో వెలుగుచూసిన అంశాల ఆధారంగా బ్యాంకింగ్ వ్యవస్థలోని లోపాలను వివరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రాకు లేఖ రాశారు. ఖాతాల ప్రారంభంలో కేవైసీ ధ్రువీకరణలో జరుగుతున్న నిర్లక్ష్యం ప్రధాన సమస్యగా ఉందని సీపీ పేర్కొన్నారు. బ్రాంచ్ స్థాయి అధికారులపై జవాబుదారీతనం నిర్ధారిస్తూ అన్ని వాణిజ్య బ్యాంకులకు కఠిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

# కాల్పుల విరమణ పొడిగించిన ట్రంప్



మొదటిపేజీ తరువాయి...

వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడమంటే యుద్ధ చర్యే అని సమానమని అన్నారు. తమ ప్రయోజనాలను రక్షించుకోవడం ఇరాన్‌కు తెలుసని స్పష్టం చేశారు. ఇక పాక్‌లో జరగాల్సిన చర్చలకు హాజరుకాకూడదని ఇరాన్ నిర్ణయించుకున్నట్లుగా టస్నీమ్ వార్త సంస్థ వెల్లడించింది. అమెరికా అతిగా డిమాండ్లు చేస్తుందని.. అవి ఒప్పందానికి అడ్డుగా మారుతున్నాయి కాబట్టి చర్చల్లో పాల్గొనడం వ్యర్థమని అభిప్రాయపడుతున్నట్లుగా పేర్కొంది. ఇదిలావుంటే ఇరాన్‌తో ప్రస్తుతం కొనసాగుతున్న కాల్పుల విరమణ ఒప్పందంపై అమెరికా ఒక హెచ్చరిక జారీ చేసింది. ఈ కాల్పుల విరమణ అనేది 'అపరిమిత కాలం' కోసం కాదని, ఇరాన్ తన బాధ్యతలను నెరవేర్చడానికి ఒక నిర్దిష్ట సమయం మాత్రమే కేటాయించామని అమెరికా ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు. ఈ అంశం గురించి సదరు అధికారి 'యాక్సియోస్' పత్రికతో మాట్లాడుతూ, ఇరాన్ నిబంధనలను పాటించకపోతే ప్రస్తుతం ఉన్న కాల్పుల విరమణను ఎప్పుడైనా రద్దు చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించడానికి ఇరాన్‌కు ఒక అవకాశం ఇచ్చామని, అయితే దీనిని ఆ దేశం బలహీనతగా భావించకూడదన్నారు. అణ్వాయుధ కార్యక్రమాలు, ప్రాంతీయ ఉగ్రవాద సంస్థలకు మద్దతు లేదా ఇతర దౌత్యపరమైన అంశాలపై ఇరాన్ నుంచి ఆశించిన మార్పులు రాకపోతే తదుపరి చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న అస్థిరతను అరికట్టడానికి అంతర్జాతీయ సమాజం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయితే, ఇరాన్ తన ప్రాక్సీ గ్రూపుల ద్వారా లేదా నేరుగా వివాదాల్లో జోక్యం చేసుకుంటే సహించేది లేదని అమెరికా పదేపదే చెబుతోంది.

# సమ్మెతో సమస్యలు పరిష్కారం కావు

మొదటిపేజీ తరువాయి...

హైదారబాద్, ఏప్రిల్22 :ఆర్టీసీ సమ్మెను విరమించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. సమస్యలకు సమ్మె పరిష్కారం కాదని ఆయన సూచించారు. సమస్యల పరిష్కారానికి నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని.. 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటు అని స్పష్టం చేశారు.ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎటువంటి వ్యతిరేకత లేదని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అవన్నీ వెంటనే పరిష్కారమయ్యే అంశాలని పేర్కొన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చరించాల్సి ఉందన్నారు. వీటిపై అధ్యయనం చేసేందుకే నాలుగు వారాల గడువు అడిగామని వివరించారు. ఈ రెండు అంశాలు కూడా సీఎం, డిప్యూటీ సీఎం దగ్గర చర్చిస్తామని అన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యమైనప్పటికీ.. ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య



అంతర్యుద్ధం, నాయకత్వ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటుందని.. అన్ని అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు. మిమ్మల్ని ఎవరూ అడ్డుకోరని.. ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. ప్రజలపై ఒత్తిడి తీసుకురావచ్చని అన్నారు. అయితే పేద ప్రజల ప్రయాణాలకు ఇబ్బంది కలగజేయవద్దని విజ్ఞప్తి చేశారు. మీ నాయకులు నిరసన తెలపవచ్చని.. మిగతా వారంతా విధుల్లో చేరి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరారు.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కెసిఆర్,హరీష్‌లకు ఊరట

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్,ఏప్రిల్22 :కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ధర్మాసనం నిలిపివేసింది. జస్టిస్ ఘోష్ కమిషన్ చట్టబద్ధమేనని న్యాయస్థానం తెలిపింది. అయితే రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో పిటిషనర్లు కేసీఆర్, హరీశ్ రావుతో పాటు స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషికి ఊరట లభించినట్లైంది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందంటూ రాష్ట్ర ప్రభుత్వం 2024 మార్చిలో జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. అయితే ఘోష్ కమిషన్‌ను సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు, స్మిత సబర్వాల్, ఎస్‌కే జోషి పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై న్యాయస్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఈ పిటిషన్లపై ఏప్రిల్ 8న వాదనలు ముగియగా తీర్పును హైకోర్టు ఈరోజుకు(ఏప్రిల్ 22) వాయిదా వేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 6ను సమర్థించిన హైకోర్టు.. జీవో నంబర్ 6ను ఆధారంగా ఏర్పాటైన కమిషన్ నివేదికను అసెంబ్లీలో చర్చ జరగకుండానే మీడియా ముందుకు తీసుకురావడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. కమిషన్ ఇచ్చిన నివేదికను ఆధారంగా చేసుకుని పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని తెలంగాణ హైకోర్టు తీర్పునిచ్చింది. కాళేశ్వరంపై హైకోర్టు తీర్పుతో కేసీఆర్‌కు ఊరట లభించిందని మాజీ సీఎం అడ్వకేట్ గండ్రమోహన్ రావు తెలిపారు. హైకోర్టు తీర్పుతో కమిషన్ రిపోర్టును చెత్తలో పడేయవచ్చన్నారు. సెక్షన్ 8 కింద విచారణ జరగలేదని చెప్పారు. పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటును హైకోర్టు సమర్థించిందని తెలిపారు. అయితే కమిషన్ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని సీబీఐ దర్యాప్తు చేయరాదని న్యాయస్థానం చెప్పిందని కేసీఆర్ అడ్వకేట్ గండ్రమోహన్ రావు వెల్లడించారు.

# హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు

మొదటిపేజీ తరువాయి...

అధికారంలోకి రాగానే.. కేసీఆర్, వారి కుటుంబ సభ్యులు, మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద హామీలు ఇచ్చారని ప్రస్తావించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావొస్తున్నా.. ఏ ఒక్క అవినీతి, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సీఎం అన్నారని చెప్పారు.. అలాగే, ఫార్ములా వన్ రేస్ పేరు మీద చేసిన ఖర్చులు, డ్రగ్స్ కేసు, భూ ఆక్రమణలు, భూ కేటాయింపులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని.. అవినీతి సొమ్మును కక్కిస్తానని పదే పదే రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ వాటిపై ఒక్కటంటే ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై.. రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోకపోవడానికి కారణం.. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న దోస్తీయేనని విమర్శించారు. ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు 'దూప్ ÷టింగ్' చేస్తూ.. 'నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చేయి' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను రెండు పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ అవినీతి పాలన నుంచి విముక్తి కోసం.. మార్పు కావాలని కాంగ్రెస్‌కు ఓటేశారని తెలిపారు. కానీ రేవంత్ సర్కార్.. హామీలను మాటలకే పరిమితం చేస్తూ.. అవినీతికి పాల్పడిన వారిని ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ సర్కార్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ.. తెలంగాణ ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకుంటోందని ఆరోపించారు. అందుకనే బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలకు కాంగ్రెస్ సర్కార్ వెనుకాడుతోందని విమర్శించారు. ఇది రేవంత్‌రెడ్డి పరిపాలనా వైఫల్యమని, ఇచ్చిన హామీలను విస్మరించి తెలంగాణ ప్రజలకు చేస్తున్న రాజకీయ ద్రోహమని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత, అసెంబ్లీలో, బయట ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే.. అవినీతి కేసుల్లో చట్టబద్ధమైన, పారదర్శకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈరోజు హైకోర్టు తీర్పు నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఎన్నికల హామీలు ఎందుకు అమలు కాలేదు..? అని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి..? అని నిలదీశారు. దొంగలు, దొంగలు కలిసి తెలంగాణను దోచుకోవడంలో పోటీపడుతూ.. రాష్ట్రాన్నినాశనం చేయాలని అనుకుంటున్నారా..? అని కిషన్‌రెడ్డి సెటైర్లు గుప్పించారు.

# ఉద్యోగిగా ఉంటూ వైసిపికి ప్రచారం

**2024లోనే వెంకట్రామిరెడ్డి సస్పెన్షన్**

**మాజీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోక్ బాబు**

అమరావతి, ఏప్రిల్ 22 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డిపై చర్యలు ప్రారంభమయ్యాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు తెలిపారు. '2024లో ఆయనను సస్పెండ్ చేసింది మీ ప్రభుత్వమే' అని వైసిపికి గుర్తుచేశారు. 2024 ఎన్నికల సమయంలో వెంకట్రామిరెడ్డి వైసీపీ జెండాలు పట్టుకుని ప్రచారం చేసినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. బద్వేల్ రిటర్నింగ్ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగానే అప్పట్లో వెంకట్రామిరెడ్డిపై నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి రాజకీయ ప్రచారంలో పాల్గొనడం 'కండక్ట్ రూల్స్'కు విరుద్ధమని.. అందుకే డిస్మిస్ చేశారని అశోక్ బాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆగష్టులో జరిగిన విచారణలో వెంకట్రామిరెడ్డి నేరం చేసినట్లు రుజువైందన్నారు. వెంకట్రామిరెడ్డి అరాచకాలు, నిబంధనల ఉల్లంఘనలన్నీ జీఓ 464లో స్పష్టంగా ఉన్నాయని చెప్పారు. వాస్తవాలు తెలుసుకోకుండా చంద్రబాబు తప్పు చేస్తున్నారంటూ జగన్ మాట్లాడటం హాస్యాస్పదమని మండిపడ్డారు. ఉద్యోగులకు రూ.30 వేల కోట్లు బాకీ పెట్టి, జీతాలు సకాలంలో ఇవ్వని వ్యక్తి జగన్ అంటూ విమర్శించారు. ఉద్యోగుల గురించి మాట్లాడే అర్హత, హక్కు జగన్‌కు లేదని అశోక్ బాబు వ్యాఖ్యానించారు. ఈ మేరకు బుధవారం ఆయన మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు తప్పు చేశారంటూ జగన్ రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఏబీ వెంకటేశ్వరరావు, ఎల్వీ సుబ్రహ్మణ్యం వంటి అధికారులను వేధించింది మరిచిపోయారా అని నిలదీశారు. ఉద్యోగులను బెదిరించి దేశంలో ఎక్కడా లేని విధంగా రివర్స్ పీఆర్సీ ఇచ్చిన ఘనత జగన్‌దే అంటూ దుయ్యబట్టారు. కూటమి పాలనలో ఇప్పటికే ఉద్యోగులకు రూ.22,000 కోట్ల మేర బకాయిలు చెల్లించామని చెప్పారు. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీలో అక్రమాలకు పాల్పడి పబ్లిక్ స్థలాలను కూడా అమ్మేసుకున్న వ్యక్తి వెంకట్రామిరెడ్డి అని ఆరోపించారు. వెంకట్రామిరెడ్డి కుటుంబం మొత్తం వైసీపీ కార్యకర్తలే అని.. ఆయన భార్య ముషీరాబాద్ టికెట్ అడిగిన విషయం నిజం కాదా అని అశోక్ బాబు ప్రశ్నించారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు చనిపోతే పట్టించుకోని జగన్.. ఉద్యోగుల పాలిట 'నరకాసురుడు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు నిబంధనల ప్రకారం, ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగిస్తున్నారని తెలిపారు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాల్సిందే అని అశోక్ బాబు స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినందుకు జగన్ ప్రభుత్వం హయాంలోనే వెంకట్రామిరెడ్డి సస్పెండ్ అయ్యారని ఏపీ టీడీపీ ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు అన్నారు. జగన్ నిజం ఒప్పుకుంటున్నాడని, ఎందుకంటే ఆయన చేసిన తప్పులకు జైల్లో పెట్టకుండా చంద్రబాబు తప్పు చేశారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఆ తప్పు చేయడంవల్లే జగన్ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని అశోక్ బాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. 2024 ఏప్రిల్ 2న ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కాండక్ట్ రూల్స్‌ను బ్రేక్ చేసి కాకర్ల వెంకట్రామిరెడ్డి, చల్లా చంద్రయ్యలు వైసీపీ జెండాలు పట్టుకొని కడప జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోల్లో వైసీపీకి అనుకూలంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారని ఆరోపించారు. అవినీతి, పనిపట్ల నిబద్ధత లేకపోవడం, పనిచేయకపోవడం వంటి వాటికి కాండక్ట్ రూల్స్ ప్రకారం చర్యలు ఉంటాయని తెలిపారు.

# పిఠాపురం ఘటనపై సిఎం చంద్రబాబు సీరియస్

**మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై అసహనం**

**వర్మతో మాట్లాడాలని పల్లాకు బాబు ఆదేశం**

అమరావతి,ఏప్రిల్ 22: పిఠాపురంలో జరిగిన ప్రొటోకాల్ అంశంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహారంపై ఘాటుగా స్పందించారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, పార్టీ నేతలు ఐక్యంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై తెలుగుదేశం పార్టీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతో సీఎం మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. టీడీపీ నేతలు ప్రొటోకాల్ పేరుతో, ఫ్లెక్సీల్లో ఫొటోల ప్రాధాన్యం కోసం ఘర్షణ పడటం సరికాదని సీఎం వ్యాఖ్యానించారు. పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ పాడా సమావేశం సందర్భంగా జరిగిన ఈ వివాదంలో మాజీ ఎమ్మెల్యే వర్మ వ్యవహరించిన తీరు సరికాదని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. పార్టీ నాయకులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఇలాంటి సంఘటనలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆయన పేర్కొన్నారు.ఈ ఘటనపై సీఎం చంద్రబాబు టీడీపీ నేతలకు కొన్ని కీలక సూచనలు చేశారు. ఏదైనా సమస్య ఉంటే పార్టీ పెద్దలకు లేదా ప్రభుత్వ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. ప్రత్యక్షంగా గొడవలు పడటం సరైన పద్ధతి కాదని తెలిపారు. ఇలాంటి ఘటనలు కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతాయని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హుకుం జారీ చేశారు. ఈ వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే వర్మకు తగిన సూచనలు



ఇవ్వాలని పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. పార్టీ అంతర్గత క్రమశిక్షణను కాపాడాలని, నేతలు వ్యక్తిగత ప్రాధాన్యం కోసం పోటీ పడకూడదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీలో ఐక్యత, క్రమశిక్షణ అత్యంత ముఖ్యమని.. వ్యక్తిగత ఘర్షణలు పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని సీఎం హెచ్చరించారు.

## ఎన్ని కుట్రలు పన్నినా న్యాయం గెలిచింది

మొదటిపేజీ తరువాయి...

ఘోష్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం స్పష్టం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలు అయ్యాయని, రేవంత్ నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యిందంటూ హరీశ్ పోస్ట్ చేశారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మం జయిస్తుందని, సత్యం నినదిస్తుందని ఈరోజు మరోసారి నిరూపితమైంది. ప్రాథమిక హక్కులు, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ నడిపిన విచారణను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. వ్యక్తిగత ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోరాదని స్పష్టంగా తీర్పునిచ్చింది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కుట్రలు బట్టబయలయ్యాయి. ప్రజా సమస్యలు పక్కనపెట్టి డ్రామాలు ఆడిన రేవంత్ రెడ్డి నిజస్వరూపం హైకోర్టు తీర్పుతో తేటతెల్లం అయ్యింది. ఇప్పటికైనా కక్షసాధింపులు, రాజకీయ దుష్ప్రచారం మానేసి వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ఎవరు ఔనన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణెళిశ్వరం.. జై తెలంగాణ.. జై కేసీఆర్' అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ట్వీట్ చేశారు.

## రెండు వారాలకు వాయిదా వేసిన సుప్రీంకోర్టు

మొదటిపేజీ తరువాయి...

ఈ కేసును క్రిమినల్ అవినీతి కేసుగా కాకుండా ఎన్నికల ఉల్లంఘనగా పరిగణించాలని ఆయన వాదించారు. మరోవైపు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తనపై నమోదైన ఈ కేసులో తన పేరును పూర్తిగా తొలగించాలని సుప్రీంకోర్టును అభ్యర్థించారు. తనపై ఉన్న ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని ఆయన వాదించారు. ఈ రెండు పిటిషన్లను కలిపి విచారించాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. దీంతో ఈ కేసు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఓటుకు నోటు కేసు గతంలో కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా పడినప్పటికీ, ఈ కేసు ప్రాధాన్యం మాత్రం తగ్గలేదు. వచ్చే విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయాలు రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, నైతిక విలువలపై ఈ కేసు కీలకంగా నిలుస్తోంది.

## దేశంలో భానుడి విశ్వరూపం..

మొదటిపేజీ తరువాయి...

ఈ జాబితాలో భారత్ వెలుపల ఉన్న ఏకైక ప్రాంతం నేపాల్‌లోని లుంబిని కావడం గమనార్హం. మరోవైపు ఏప్రిల్ 22 నుంచి 24 వరకు దేశంలో వడగాల్పుల తీవ్రత కొనసాగుతుందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సాధారణంగా గరిష్ఠ ఉష్ణోగ్రత 40 డిగ్రీలు దాటితే దానిని వడగాల్పుగా పరిగణిస్తారు. వాతావరణ నిపుణుల ప్రకారం ఈ తీవ్రమైన వేడికి పలు కారణాలు ఉన్నాయి. నిర్మలమైన ఆకాశం కారణంగా సూర్యరశ్మి నేరుగా భూమిని తాకడం, హిమాలయాల్లో మంచు కవచం తగ్గడం, వాయవ్య దిశ నుంచి పొడి గాలులు వీయడం వంటివి ప్రధాన కారణాలుగా చెబుతున్నారు. సముద్రపు నీటి ఉష్ణోగ్రతల్లో మార్పులు కూడా దేశంలో అధిక ఉష్ణోగ్రతలు దోహదం చేస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. రాబోయే వారాల్లో కూడా వేడి తీవ్రత కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు.

## బ్యాంకింగ్ వ్యవస్థలో సమూల ప్రక్షాళన అవసరం

మొదటిపేజీ తరువాయి...

ఆర్బీఐ మార్గదర్శకాల అమలుపై తక్షణమే సిస్టమిక్ ఆడిట్ నిర్వహించాలని సూచించారు. ప్రజల సొమ్మును కాపాడాల్సిన కొంతమంది బ్యాంకు అధికారులే సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కవుతున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లో జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ కేవైసీ వెరిఫికేషన్‌లో జరిగిన లోపాలు భద్రతా వైఫల్యానికి నిదర్శనమని తెలిపారు. సైబర్ నేరాలకు సహకరించిన బ్యాంకు అధికారులను గుర్తించి ఆర్బీఐకి నివేదించి వారిని శాశ్వత బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని సూచించారు. మ్యూల్ అకౌంట్లపై నిరంతర పర్యవేక్షణ కోసం ఆర్బీఐ, బ్యాంకులు, పోలీసులతో కూడిన జాయింట్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి వేదికల్లో వచ్చే అధిక లాభాల ప్రకటనలను నమ్మవద్దని, 'డిజిటల్ అరెస్ట్' పేరిట వచ్చే బెదిరింపులకు భయపడవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే 'గోడలెన్ అవర్'లో 1930 నంబర్‌కు కాల్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.

## అమెరికా-ఇరాన్ చర్చల్లో ప్రతిష్టంభన

మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీ,: అమెరికా, ఇరాన్ మధ్య శాంతి చర్చల పునరుద్ధరణపై నెలకొన్న ఉత్కంఠకు ప్రస్తుతానికి తెరపడలేదు. పాకిస్థాన్‌లో జరగాల్సిన రెండో విడత చర్చల కోసం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని బృందం చేయాల్సిన పర్యటన తాత్కాలికంగా వాయిదా పడింది. చర్చల్లో పాల్గొనడంపై ఇరాన్ నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడమే ఇందుకు కారణమని వైట్‌హౌస్ వర్గాలు వెల్లడించాయి. మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ అభ్యర్థన మేరకు ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని నిరవధికంగా పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ విషయాన్ని తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. ఇరాన్ ఒక స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వచ్చేవరకు ఈ సీజ్‌ఫైర్ కొనసాగుతుందని తెలిపారు. అయితే, కాల్పుల విరమణను పొడిగించినప్పటికీ, హర్మూజ్ జలసంధిలో అమెరికా నౌకా దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇదే అంశం చర్చలకు ప్రధాన అడ్డంకిగా మారింది. నౌకా దిగ్బంధనాన్ని ఎత్తివేసే వరకు తాము చర్చలకు హాజరుకాబోమని ఇరాన్ తేల్చిచెప్పింది. అమెరికా చర్యల వల్ల వారి చిత్తశుద్ధిపై అనుమానాలు ఉన్నాయని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ పేర్కొన్నారు. దీంతో కాల్పుల విరమణ కొనసాగుతున్నప్పటికీ, ఇరు దేశాల మెట్టుదిగని వైఖరివల్ల చర్చలప్రక్రియలోప్రతిష్టంభన ఏర్పడింది.

# సంపాదకీయం

## నేడు ప్రపంచ పుస్తక దినోత్సవం...

### 'పుస్తకం' మనసుకు మిత్రుడు, సమాజానికి మార్గదర్శి !




'ఒక మంచి పుస్తకం చదవడం అంటే కొత్త స్నేహితున్ని సంపాదించుకోవడం..అదే పుస్తకాన్ని మళ్లీ చదవడం అంటే పాత స్నేహితున్ని కలవడం' అని ప్రముఖులు చెప్పిన మాటలు పుస్తకాల మహత్యాన్ని స్ఫురింపజేస్తాయి. నిజానికి పుస్తకాలు కేవలం కాగితపు కట్టలు కావు; అవి మనసును మలిచే శక్తులు, మనుగడను మార్గనిర్దేశం చేసే గురువులు. ఈ గొప్పతనాన్ని గుర్తుచేసుకునే రోజే ప్రపంచ పుస్తక దినోత్సవం.

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. చదవడం, రచన, ప్రచురణ, కాపీరైట్ హక్కులపై అవగాహన పెంచడం దీని ముఖ్య ఉద్దేశ్యం. 1995లో ప్యారిస్‌లో జరిగిన సమావేశంలో యునెస్కో ఈ దినోత్సవాన్ని అధికారికంగా ప్రకటించింది. యువతను పుస్తకాల వైపు మళ్లించడం, పఠన సంస్కృతిని పెంపొందించడం ఈ రోజు వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం.

ఈ తేదీకి ఒక ప్రత్యేకత ఉంది. ప్రపంచ సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన రచయితలు విలియం షేక్స్పియర్, మిగ్యువల్ సెర్వంటెస్, గార్సిలాసో డి లా వేగా వంటి మహనీయుల వర్ధంతి ఏప్రిల్ 23 కావడంతో ఈ రోజును ఎంపిక చేశారు. సాహిత్యానికి వారు అందించిన సేవలకు గౌరవంగా ఈ దినోత్సవం నిర్వహించబడుతోంది.

పుస్తకాల ప్రాముఖ్యత గురించి చెప్పాలంటే అది అపారమైనది. మనకు తెలియని ప్రపంచాలను పరిచయం చేయడం, గతాన్ని వర్తమానంతో కలపడం, భవిష్యత్తుకు దిశా నిర్దేశం చేయడం..ఇవన్నీ పుస్తకాల వల్లే సాధ్యమవుతున్నాయి. ఎన్నో తరాల అనుభవాలు, ఆలోచనలు, భావాలు పుస్తకాల రూపంలో మనకు అందుతున్నాయి. చరిత్రను పదిలపరచడం, సంస్కృతిని కాపాడడం, విలువలను పరిరక్షించడం వంటి కీలక బాధ్యతలను పుస్తకాలు నిర్వర్తిస్తున్నాయి.

పుస్తకాలు మన వ్యక్తిత్వ వికాసానికి కూడా ఎంతో దోహదపడతాయి. పఠనం వల్ల జ్ఞానం పెరుగుతుంది, లోతుగా ఆలోచించే తత్వం అలవడుతుంది, భాషా పటిమ మెరుగుపడుతుంది. అంతేకాకుండా పుస్తకాలు మనసుకు ప్రశాంతతను ఇస్తాయి. ఒత్తిడిని తగ్గించి మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అందుకే 'పుస్తకాలు లేని ఇల్లు ఆత్మలేని శరీరం లాంటిది' అని ప్రాచీన రోమ్‌కు చెందిన గొప్ప వక్త, తత్వవేత్త, రచయిత సిసెరో అంటాడు. చదువు, జ్ఞానం, ఆలోచనలే మనిషిని సంపూర్ణంగా చేస్తాయని ఆయన భావన. అయితే ఆధునిక డిజిటల్ యుగంలో పఠన అలవాటు క్రమంగా తగ్గిపోతున్నదనే ఆందోళన వ్యక్తమవుతోంది. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, తక్షణ వినోదం వంటి అంశాలు యువతను పుస్తకాల నుండి దూరం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో పుస్తక దినోత్సవం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. పుస్తకాలు చదవడం ఒక అలవాటుగా మారితేనే విజ్ఞానం పెరుగుతుంది, సమాజం ముందుకు సాగుతుంది.

పుస్తకాలు కేవలం వ్యక్తిగత అభివృద్ధికే కాదు, సమాజ అభ్యున్నతికి కూడా కీలకం. అవి మనలో విలువలను నాటుతాయి, ప్రశ్నించే స్వభావాన్ని పెంచుతాయి, సృజనాత్మకతను ప్రోత్సహిస్తాయి. మంచి పుస్తకం ఒక వ్యక్తిని మాత్రమే కాదు, ఒక సమాజాన్నే మార్చగలదు. ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక సంకల్పం చేయాలి..రోజుకు కొంత సమయం పుస్తకాలకు కేటాయించాలి. పిల్లల్లో పఠన అలవాటు పెంచాలి. స్నేహితులకు, బంధువులకు పుస్తకాలను బహుమతిగా ఇవ్వాలి. ఎందుకంటే పుస్తకాన్ని మించిన బహుమతి మరొకటి లేదు.

మొత్తానికి పుస్తకాలు మన జీవితానికి దిక్సూచులు. అవి మనకు జ్ఞానం మాత్రమే కాకుండా జీవన విలువలను నేర్పిస్తాయి. పుస్తకాలను ప్రేమించడం అంటే జ్ఞానాన్ని ప్రేమించడం. జ్ఞానం ఉన్నచోటే నిజమైన అభివృద్ధి ఉంటుంది. అందుకే ప్రముఖ సంఘ సంస్కర్త, రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పినట్లు..'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో... కానీ ఒక మంచి పుస్తకం మాత్రం కొనుక్కో' అనే సందేశాన్ని మన జీవిత సూత్రంగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది.

**ఉదయ్ కుమార్. జి**
DAE, BA, BCJ, MCJ, LLB, MPhil., PhD
**సీనియర్ జర్నలిస్టు**
**ఫోన్ నెంబర్ 8367603197**

# అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే



రాజాపేట (తెలంగాణ వాణి విలేఖరి): రాజపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రం 2 లో గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ టీచర్ పార్వతి ముందుగా తల్లుల సమావేశం ఏర్పాటు చేసి తమ అంగన్వాడి కేంద్రం లో ప్లే స్కూల్ ద్వారా పిల్లలకుఏ విధంగా ఆటపాటల ద్వారా విద్యను అందించటం, వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మంచి పౌష్టికాహారాన్ని అందజేయడం, అలాగే ప్రతి నెల బరువు ఎత్తును సరి చూసుకుంటూ బరువు తక్కువగా ఉన్న పిల్లలకు అదనపు పౌష్టికాహారాన్ని ఇస్తూ తల్లులకు తగిన సలహాలు సూచనలు అందజేస్తూ, గర్భిణీ బాలింతలకు తగిన పౌష్టికాహారాన్ని ఇస్తూ ప్రతి నెల అంగన్వాడీ కేంద్రంలో రెండో శనివారం రోజున ఆరోగ్య సిబ్బందిచే ఆరోగ్య తనిఖీలు చేయిస్తూ సేవలను అందిస్తున్నామని తెలియజేశారు.అలాగే ఈ సంవత్సరం ఐదు సంవత్సరాలు పూర్తి అయిన పిల్లలు ప్లే స్కూల్ విద్యను పూర్తి చేసుకుని వచ్చే సంవత్సరానికి ఒకటో తరగతికి వెళ్తున్న పిల్లలు యొక్క ప్రోగ్రెస్ కార్డును తల్లిదండ్రులకు వివరిస్తూ వారికి అందజేశా రు. అదేవిధంగా ఈ సేవలన్నీ ఆన్లైన్ లో ఏవిధంగా పొందుపరు స్తున్నామో తల్లులకు వివరించారు. కార్యక్రమంలో తల్లులు మాట్లాడు తూ అంగన్వాడీ కేంద్రానికి పంపించిన తర్వాత మా పిల్లలు అన్ని ఆటలలో పాటల్లో చురుగ్గా ఉంటున్నారని అంగన్వాడీ కేంద్రానికి పంపించడం తమకు చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లులుఎర్రగోకుల సంతోష, దుబ్బాసి వెన్నెల, పొలిమేర ప్రభావతి, కొత్త భానుప్రియ, పెద్దోళ్ల సరిత, మేకల పవిత్ర, మామిడి మల్లీశ్వరి ఆయమ్మ కోయ విజయ చిన్నారులు పాల్గొన్నారు.

# వరల్డ్ ఎర్త్ డే కార్యక్రమంలో ప్రభుత్వ విప్



నకిరేకల్ : ( తెలంగాణ వాణి ) నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని హై స్కూల్ నందు " వరల్డ్ ఎర్త్ డే " కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. హై స్కూల్ నుండి మెయిన్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని , పర్యావరణం పరిరక్షణ కోసం చెట్లు నాటడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తు తరానికి స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ఇప్పటినుంచి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రజిత - శ్రీనివాస్, విద్యార్థులు అధికారులు మరియు తదితరులు పర్యావరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కాళేశ్వరం అవినీతి బయటపడే భయంతోనే కోర్టులు ఆశ్రయించిన బీఆర్ఎస్

నకిరేకల్, ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి): నకిరేకల్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ పార్టీ వైఖరిని తీవ్రంగా విమర్శించారు. పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని మొదటి నుంచి తప్పుబడుతున్న బీఆర్ఎస్, తమ అవినీతి బయటపడుతుందనే భయంతో కోర్టులను ఆశ్రయించిందని ఆరోపించారు. కొన్ని అంశాలపై మాత్రమే హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ, మొత్తం కేసు గెలిచినట్లుగా గోబెల్స్ ప్రచారం చేస్తోందని విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపాలు, నిర్మాణపరమైన తప్పిదాల వల్ల భారీ నష్టం జరిగి వేలాది కోట్ల ప్రజాధనం వృథా అయిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితికి బాధ్యులైన వారే కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకోవడం ప్రజలు గమనించాల్సిన విషయమన్నారు. అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ కోసం అవసరమైతే సీబీఐ దర్యాప్తు కూడా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. ఈ అవినీతిలో ఎవరు పాలుపంచుకున్నా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా గతంలో కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ నేతలు ఏటీఎంలా ఉపయోగించుకున్నారని చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ, వాటి నిజానిజాలను ప్రజలే అంచనా వేయాలని అన్నారు. ఈ అంశంపై కేంద్ర



ప్రభుత్వం కూడా తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు.పదేళ్లపాటు అధికారంలో ఉండి ప్రజాసంపదను దోచుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులుఇప్పటికీ అహంకారంతో మాట్లాడటం సరికాదని అన్నారు. సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు వారికి గుణపాఠం కావాల్సి ఉండగా, ఇంకా మార్పు కనిపించ డం లేదని వ్యాఖ్యానించారు.కమిషన్ల కోసం, స్వప్రయోజనాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగించి ప్రజల సొమ్మును దోచుకున్నారనేది ప్రజల్లో బలంగా ఉన్న అభిప్రాయమని తెలిపారు. కాళేశ్వరం అవినీతి పూర్తిగా వెలుగులోకి వచ్చి బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు ప్రభుత్వ పోరాటం కొనసాగుతుందని వేముల వీరేశం స్పష్టం చేశారు.

# కో-ఆప్షన్ సభ్యుల ఎంపికతో బీఆర్ఎస్ కి మరింత బలం



కామారెడ్డి: కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ తరఫున కో-ఆప్షన్ సభ్యులుగా కుంభాల రవి, షౌకత్ నామినేషన్ పత్రాలుదాఖలు చేశారు.మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కాసర్ల గోదావరి స్వామి ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కో-ఆప్షన్ సభ్యుల ఎంపికతో కౌన్సిల్ మరింత బలోపేతం అవుతుందని,పట్టణంలో పెండింగ్‌పనులను వేగవంతం చేస్తామని అన్నారు.నామినేషన్ దాఖలుచేసినఅనంతరం కుంభాలరవి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. షౌకత్ మాట్లాడుతూ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, మున్సిపల్ పాలనలో అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలలో భక్తులకు మరింత మెరుగైన వసతి సదుపాయాలు : టీటీడీ ఈవో



తిరుపతి : శ్రీవారి దర్శనార్థం తిరుమల, తిరుపతికి వచ్చే భక్తులకు మరింత మెరుగైన వసతి సదుపాయాలు కల్పించేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజూ వేలాదిగా వచ్చే భక్తులకు ప్రస్తుత వసతి సదుపాయాలు సరిపోవడం లేదని, వాటిని విస్తరించేందుకు సమగ్ర అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా తిరుపతిలో వసతి సదుపాయాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తిరుమలలో మాడవీధులు, ఆలయ పరిసరాలు, ముఖ్య ప్రదేశాల్లో నిరంతరం నీటి పిచికారీ చేయాలని ఆదేశించారు. భక్తుల నుండి అభిప్రాయాలు సేకరించి, వాటి ఆధారంగా సేవలను మరింత మెరుగుపరచాలని చెప్పారు. అన్ని ఆలయాల్లో క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయ సేకరణ చేపట్టాలని సూచించారు.తిరుమలలో నెయ్యి నిల్వ ట్యాంకులు, ముడి సరుకుల గోదాముల సామర్థ్యాన్ని పెంచేందుకు కొత్త గోదాములు నిర్మించాలని, పెండింగ్ వ్యర్థాలను త్వరగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఏసి-1, ఆస్థాన మండపాలను ఆధునీకీకరించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవోలు వి. వీరబ్రహ్మం, డా. ఎం. శరత్, సీవీఎస్వో కె. వి. మురళీకృష్ణ, సీఈ టి వి సత్యనారాయణ, అడిషనల్ ఎఫ్ఏసీ ఏ. వో శ్రీ రవిప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

## ధర్మాపూర్ అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహణ



రాయికోడ్:ఏప్రిల్ 22(తెలంగాణ వాణి ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం ధర్మాపూర్ గ్రామంలో బుధవారం నాడు అంగన్వాడీ టీచర్ మంజుల ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులతో కలిసి గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు వారి విద్యా సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా వారు ప్రత్యేకమైన దుస్తులు ధరించి, చేతులలో సర్టిఫికెట్ లు పట్టుకొని పై తరగతికి వెళ్లిపోతున్నామని ఆనందోత్సాహం లో మునిగిపోయారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎంఈఓ నర్సిములు హాజరై చిన్నారులు అంగన్వాడీ స్థాయి నుండి ప్రాథమిక పాఠశాలలోకి వెళ్తున్నందుకు వారిని అభినందించారు.ప్రతి ఒక్క చిన్నారి పాఠశాలలో ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమాదేవి,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్వేత,రాయికోడ్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగేష్,రాయికోడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్,నాయకులు శాంతకుమార్, పాండు రంగారెడ్డి,పంచాయతీ కార్యదర్శి ఖదీర్,పిల్లల తల్లి దండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఆదివాసీ టూరిజం ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్' నుహా హా జెండా ఊపి ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు




ఉట్నూర్, ఏప్రిల్ :22 ( తెలంగాణ వాణి) : గోండు గూడ నుంచి 8 బస్సుల్లో బయలుదేరినహైదరాబాద్ కు 250 మంది ఆదివా సీలు. మధ్యాహ్నం 1 గంటకు హైదరాబాద్ లోని తారామతి బారాదరికి చేరుకోనున్న ఆదివాసీ పర్యాటకులు. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం, చార్మినార్, గోల్కొం డ కోట, తారామతి బరాదరి, లుంబినీ పార్క్, శిల్పారామం వంటి ప్రముఖ పర్యాటక ప్రాంతాలను వీరు సందర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పి.వో యువరాజు మర్మట్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ కామ్డే, ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్‌హాహాఆత్రం సుగుణ, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సక్కు, సోయం బాపురావు, ఆడే గజేందర్, తదితరులు పాల్గొన్నారు.

# చర్ల, దుమ్ముగూడెంకు 23 బోర్లు మంజూరు

### ఎంపీ వద్దిరాజు నిధుల కేటాయింపు



భద్రాచలం (తెలంగాణ వాణి) ఏజెన్సీ ప్రాంతాలైన చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని గిరిజన గూడెల్లో నీటి ఎద్దడి సమస్యకు బీఆర్ఎస్ రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పరిష్కారం చూపారు. తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అక్కడి గిరిజనులకు చేతిపంపుల ద్వారా మంచినీటిని అందజేసేందుకు ఆయన ముందుకు వచ్చారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు చేసిన విజ్ఞప్తి మేరకు ఎంపీ రవిచంద్ర స్పందించి తన ఎంపీ ల్యాడ్స్ నిధులతో రెండు మండలాల్లో 23 మంచినీటి బోర్లు మంజూరు చేశారు. వీటిలో దుమ్ముగూడెం లో 15, చర్లలో 8 బోర్లు ఉన్నాయి. ఈ మేరకు బోర్ల నిర్మాణానికి అయ్యే రూ.35 లక్షలు విడుదల చేశారు. ఎండాకాలం తీవ్రత దృష్ట్యా సత్వరమే బోర్ల నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు. తాము అడిగిన వెంటనే బోర్లు మంజూరుతో పాటు నిధులు విడుదల చేసినందుకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కు భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణలు కృతజ్ఞతలు తెలిపారు.

# దోస్తు ఉచిత స్వచ్ఛంద సహాయ కేంద్రం ఏర్పాటు

**విద్యార్థినిలు ప్రైవేట్ నెట్ సెంటర్లో చుట్టూ తిరిగి డబ్బులు వృధా చేసుకోవద్దు**
**-కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి ఈశ్వరయ్య**

వనపర్తి : ఏప్రిల్ 22, (తెలంగాణ వాణి ప్రతినిధి) దోస్త్ 2026-27 అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన సందర్భంగా వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. ఈశ్వరయ్య ఒక ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అండర్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ఈ కళాశాల విద్యార్థినులు అజీమ్ ప్రేమ్‌జీ సంస్థ నుండి సుమారు రూ. 3 లక్షల స్కాలర్‌షిప్‌ను పొందగా, సోహమ్ అకాడమీ నుండి కూడా రూ. 80,000 ఆర్థిక సహాయం



పొందినట్లు వెల్లడించారు.రాబోయే విద్యా సంవత్సరంలో ఈ విధమైన స్కాలర్‌షిప్ అవకాశాలు మరింత పెరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అందువల్ల, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు తమ ఉన్నత విద్య కోసం వనపర్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

# పోలవరంపై సందేహాలకు తెర..

## పూర్తి ఎత్తుతోనే నిర్మాణం



- పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై నెలకొన్న సందేహాలకు తెర
- గరిష్ఠ ఎత్తు 45.72 మీటర్లుగా పీపీఏ అధికారిక ప్రకటన
- కేంద్ర జలశక్తి కార్యదర్శి పర్యటన తర్వాత మారిన చిత్రం
- వచ్చే ఏడాది జూన్ నాటికి తొలి దశ పనులు పూర్తికి లక్ష్యం

పోలవరం: బహుళార్థ సాధక పోలవరం ప్రాజెక్టు ఎత్తు విషయంలో నెలకొన్న సందేహాలకు తెరపడింది. ప్రాజెక్టును దాని పూర్తిస్థాయి ఎత్తయిన 45.72 మీటర్ల వద్దే నిర్మించనున్నట్లు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) అధికారికంగా స్పష్టం చేసింది. దీంతో ప్రాజెక్టులో 194.60 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు మార్గం సుగమమైంది. పీపీఏ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈ వివరాలను పొందుపరచడంతో ప్రాజెక్టు భవిష్యత్తుపై స్పష్టత వచ్చింది. ఇటీవల కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు ప్రాజెక్టును సందర్శించిన తర్వాత ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయన పర్యటనకు ముందు, ప్రాజెక్టును తొలి దశలో 41.15 మీటర్లకే పరిమితం చేస్తారన్న సమాచారం పీపీఏ వెబ్‌సైట్‌లో ఉండేది. అయితే, కాంతారావు పర్యటన అనంతరం ఆ వివరాలను సవరించి, గరిష్ఠ నీటిమట్టం వివరాలను చేర్చారు. ప్రాజెక్టు రెండో దశకు అవసరమైన అటవీ, పర్యావరణ అనుమతులు, భూసేకరణ, పునరావాసం వంటి అంశాలను కేంద్ర ప్రభుత్వమే పర్యవేక్షిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీతో రెండో దశ పనులకు కేంద్రం సిద్ధమవుతోందన్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మరోవైపు, ప్రాజెక్టు తొలిదశ పనులను వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తిచేయాలని జల వనరుల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే స్పిల్‌వే నిర్మాణం పూర్తవగా, ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాం పనులు వేగంగా సాగుతున్నాయి. ప్రాజెక్టు పూర్తయితే 10.13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణతో పాటు, కృష్ణా బేసిన్‌కు 80 టీఎంసీల నీటి తరలింపు, తాగునీరు, 960 మెగావాట్ల విద్యుదుత్పత్తి వంటి ప్రయోజనాలు చేకూరనున్నాయి. అయితే, రెండో దశ పనులు ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారనున్నాయి. రెండో దశ కోసం సుమారు 86,000 నిర్వాసిత కుటుంబాలను తరలించాల్సి ఉండగా, భూసేకరణ, పునరావాసానికి రూ. 28,561 కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా.

# పిఠాపురంలో మళ్లీ ఫ్లెక్సీ చిచ్చు..

## పవన్‌ను టార్గెట్ చేస్తున్నారంటూ వర్మపై ముద్రగడ క్రాంతి ఫైర్

- పిఠాపురంలో ఫ్లెక్సీ వివాదం.. టీడీపీ, జనసేన కార్యకర్తల మధ్య తోపులాట
- సీఎం చంద్రబాబు ఫొటో లేకపోవడంపై మాజీ ఎమ్మెల్యే వర్మ ఆగ్రహం
- వర్మ తీరుపై జనసేన నేత ముద్రగడ క్రాంతి తీవ్రస్థాయిలో విమర్శలు
- ఉద్దేశపూర్వకంగానే పవన్ కల్యాణ్‌ను వర్మ టార్గెట్ చేస్తున్నారని ఆరోపణ
- కూటమిలో చిచ్చు పెట్టేలా వ్యవహరించవద్దని వర్మకు క్రాంతి హితవు



కాకినాడ: కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో అధికార కూటమిలోని టీడీపీ, జనసేన పార్టీల మధ్య విభేదాలు మరోసారి బయటపడ్డాయి. ఓ ప్రభుత్వ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సీఎం చంద్రబాబు నాయుడు ఫొటో లేకపోవడం తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ ఘటన ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాటకు, ఉద్రిక్తతకు కారణమైంది. పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పీఏడీఏ) కార్యాలయంలో జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమంలో ఈ వివాదం చోటుచేసుకుంది. ఫ్లెక్సీలో సీఎం ఫొటో లేకపోవడాన్ని గమనించిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ.. అక్కడి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అక్కడే ఉన్న జనసేన నేతలు తుమ్మలబాబు, పెండెం దొరబాబులు వర్మతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో పెండెం దొరబాబు, వర్మపైకి దూసుకెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరు పార్టీల కార్యకర్తలు ఒకరినొకరు తోసుకోవడంతో అక్కడ గందరగోళం నెలకొంది. ఈ ఘటనపై జనసేన పార్టీ నేత, ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి ఘాటుగా స్పందించారు. మాజీ ఎమ్మెల్యే వర్మ తీరుపై ఆమె తీవ్ర విమర్శలు చేశారు. పిఠాపురంలో పవన్ కల్యాణ్ పోటీ చేసినప్పటి నుంచి వర్మ వైఖరి వింతగా ఉందని, ఉద్దేశపూర్వకంగానే ఆయన రచ్చ చేస్తున్నారని ఆరోపించారు. "ఫ్లెక్సీలో ఫొటోల గురించి రగడ సృష్టించడం ఏమిటండి? ఈ రెండేళ్లలోనే ఎమ్మెల్యే పవన్ కల్యాణ్ రూ.600 కోట్ల అభివృద్ధి పనులు నియోజకవర్గానికి తీసుకొచ్చారు. ఇంకా అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నారు. అయినా చీటికీ మాటికీ పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేయడం సరికాదు" అని క్రాంతి అన్నారు. పవన్ కల్యాణ్ కేవలం ఎమ్మెల్యే మాత్రమే కాదని, జనసేన అధినేతగా ఎన్డీయేలో భాగస్వామి అనే విషయాన్ని వర్మ గుర్తుంచుకోవాలని ఆమె హితవు పలికారు. వర్మ తీరు కూటమిలో చిచ్చు పెట్టేలా ఉందని, ప్రజల్లో కూడా దీనిపై గుసగుసలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలుంటే పార్టీలో అంతర్గతంగా మాట్లాడుకోవాలి కానీ, ఇలా బహిరంగంగా వ్యవహరించి వార్తల్లోకి ఎక్కడం సబబు కాదని సూచించారు. ఇప్పటికైనా వర్మ తన తీరు మార్చుకోవాలని క్రాంతి సలహా ఇచ్చారు.

# పైసలు ల్లేకుండానే పదవులు

హైదరాబాద్, ఏప్రిల్ 22,: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెం టనే 37 మందిని చైర్మన్లుగా నామినేటెడ్ పదవుల్లో భర్తీచేసింది. ఆ తర్వాత మరో ఐదారుగు రిని ప్రభుత్వం నియమించింది. ఇంకా భర్తీచేయని నామినేటెడ్ పోస్టులు 30కి పైగానే ఉన్నాయి. అయితే మొదటి విడతలో భర్తీచేసిన వాటిలో కీలకమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా ర్టీ, మహిళా, దివ్యాంగులతో పాటు వివిధ కులాల కార్పోరేషన్లు కూడా ఉన్నాయి. మొదటగా భర్తీచేసిన చైర్మన్ల పదవీ కాలం జూలై రెండోవారంలో ముగుస్తుంది. అయితే వీరి పదవీ కాలంలో ఏ ఒక్కరికి కూడా కార్పోరేషన్ల ద్వారా నిధులు ఇవ్వలేదు. దాంతో కార్పోరేషన్ల ద్వారా సాయం చేయలేని పరిస్థితి నెలకొన్నది. ఆయా కార్పోరేషన్ల చైర్మన్లకు రుణాలు ఇప్పించాలని నిత్యం ఒత్తిడి ఉన్నా.. చైర్మన్లు చేసేదేమిలేక మిన్నకుండిపోతున్నారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు, సమావేశాలకు వెళ్లడం తప్ప.. ప్రభుత్వపరంగా నిరుద్యోగ యువతకు, నమ్ముకున్న కేడర్‌కు న్యాయంచేయలేని పరిస్థితి వారిది. పదవీకాలం ముగియనుండటం తో తమకు మరోసారి అవకాశం కల్పించాలని ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. రాష్ట్రంలోని వివిధ కార్పోరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించలేని దుస్థితి నెలకొన్నది. నిధుల లేమితో గతేడాది అట్టహాసంగా ప్రారంభించిన యువ వికాసం పథకం అటకెక్కింది. ఈ పథకం కోసం లక్షలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే సర్కార్ నిధులు విడుదల చేయకపోడంతో నిరుద్యోగ యువత ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పిషర్మెన్, వికలాంగులతో పాటు వివిధ కులాల ఫెడరేషన్లు, కార్పోరేషన్లలో.. యువతకు ఉమ్మడి రాష్ట్రం లో ప్రతి ఏటా సబ్సిడీ ద్వారా ప్రభుత్వం రుణాలు ఇవ్వడం జరుగుతుండేది. కానీ, రాష్ట్ర విభజన తర్వాత పరిస్థితి మారి పోయింది. బీఆర్ఎస్ హయాంలో రెండు, మూడేళ్లు నిరుద్యోగ యువతకు రుణాలు ఇచ్చినా.. వాటికి సబ్సిడీని విడుదల చేయలేదు. కాంగ్రెస్ ప్రభు త్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తికావస్తున్నా ఇప్పటివరకు ఒక్కరికి కూడా ఆయా కార్పోరేషన్ల ద్వారా రుణాలు ఇవ్వలేదు. ఎన్నికల ముందు ఇప్పుడున్న కార్పోరేషన్లకు అదనంగా కులాలవారీగా కార్పోరేషన్లు ఏర్పాటుచేసి.. ఆయావర్గాల యువతను రుణాలు ఇచ్చి ఆర్థికంగా బలోపేతం చేస్తామన్న హామీ నీటి మూటగానే మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ సర్కార్ కార్పోరేషన్ల ద్వారా కొత్త రుణాలు ఇవ్వకపోగా.. గత ప్రభుత్వం హయాంలో ఇ చ్చిన రుణాలకు కనీసం సబ్సిడీ నిధులను కూడా విడుదల చే యడం లేదు. దీంతో గతంలో రుణాలు తీసు కున్న వ్య క్తులు.. తిరిగి బ్యాంకులకు అప్పులు చెల్లించలేని పరిస్థితి నెలకొన్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పోరేషన్ల ద్వారా గత ప్ర భుత్వంలో లక్షలాది మంది యువత ఎ క్కువగా వాహనాలు తీసుకొని

### ఉత్సవ విగ్రహాలుగా నామినేటెడ్ నేతలు

సొంతంగా నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రూ. 1 లక్ష వరకు 80 శాతం, రూ. 2 లక్షల వర కు 70 శాతం, రూ. 3 నుంచి రూ. 10 లక్షల వరకు 60 శాతం వరకు ఇస్తామన్న సబ్సిడీని ప్రభుత్వం ఇప్పటీ వరకు విడుదల చేయకపో వడంతో లబ్దిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. గిరిజన కార్పోరేషన్ ద్వారా ఎస్టీ యువత దాదా పు 29 వేల మంది వరకు సబ్సిడీ రుణాల కోసం ఎదురు చూ స్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బ్యాంకుల ద్వారా రు ణాలు తీసుకున్నారు. వీరికి సబ్సి డీ కింద ప్రభుత్వం సుమారుగా రూ. 221 కోట్ల వరకు విడుదల చేయాల్సి ఉంది. ఎస్సీ కార్పోరేషన్ నుంచి కూ డా గత సర్కార్ హయాంలోనే 50 వేల మందికి పైగా పథకాల కింద సబ్సీడీ రుణాలు తీసుకున్నారు. ఎస్సీ కార్పోరేషన్ సబ్సిడీ కింద విడుదల చేయాల్సిన రూ. 300 కోట్ల వరకు ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టినట్లు అ ధికారులు పేర్కొంటున్నారు. బీసీ కార్పోరేషన్‌తో పాటు మిగతా కులాల కార్పోరేషన్లలోనూ ఇదే పరిస్థితి.

### రేవంత్ రెడ్డి రైతన్నలకు క్షమాపణలు చెప్పాలి
### చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి

హనుమకొండ, ఏప్రిల్ 22: పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పు ప్రభుత్వనికి చెంప పెట్టని బీఅర్ఎస్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. రాజకీయ కక్షసాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న ఈ తీర్పు అని ఇప్పటికైనా రాజకీయ కుట్రలు పక్కన పెట్టి రైతన్నల కోసం పనిచేయాలన్నారు. రెండున్నరేళ్లుగా కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును పడావు పెట్టిన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అది పీసీ ఘోష్ కమిషన్ కాదని, ముమ్మాటికీ పీసీసీ నివేదికని బీఆర్ఎస్ పార్టీ ముందు నుంచి చెబుతున్న మాట ఇవ్వాళ అక్షరాలా నిజమని తేలిపోయిందన్నారు. భారత రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా దేశంలోని గౌరవ న్యాయస్థానాలు చూస్తూ ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్న ప్రభుత్వ వైఖరిని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, రైతుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని వెంకటేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు.

# గుంతల రోడ్లతో విసుగు..

## పోర్షే కారుపైనే సిమెంట్ కలిపిన యువకుడు..




- బెంగుళూరులో గుంతల రోడ్లపై వినూత్న నిరసన
- పోర్షే కారు బానెట్‌పై సిమెంట్ కలిపిన వ్యాపారవేత్త
- రోడ్డు గుంతను స్వయంగా పూడ్చిన అఖిల్ హేమాద్రి

బెంగళూరు : బెంగళూరు నగరంలోని గుంతల రోడ్లపై విసుగు చెందిన ఓ వ్యాపారవేత్త వినూత్నంగా తన నిరసన తెలియజేశాడు. అధికారులు పట్టించుకోకపోవడంతో తానే స్వయంగా రంగంలోకి దిగాడు. ఏకంగా తన ఖరీదైన పోర్షే కారు బానెట్‌పైనే సిమెంట్ మిశ్రమాన్ని కలిపి, రోడ్డుపై ఉన్న గుంతను పూడ్చాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అఖిల్ హేమాద్రి అనే వ్యాపారవేత్త తన ఎరుపు రంగు పోర్షే కారులో నిర్మాణ సామాగ్రితో దెబ్బతిన్న రోడ్డు వద్దకు చేరుకున్నాడు. ఆ తర్వాత, తన కారు బానెట్‌నే సిమెంట్ కలపడానికి ఒక ఉపరితలంగా వాడుకున్నాడు. విలాసవంతమైన కారును ఇలాంటి పనికి వాడటం అందరి దృష్టిని ఆకర్షించింది. సిమెంట్ మిశ్రమాన్ని జాగ్రత్తగా తయారు చేసి, గుంతలో వేసి రోడ్డును బాగు చేయడానికి ప్రయత్నించాడు. ఈ వీడియో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. ఓ ఖరీదైన స్పోర్ట్స్ కారును రోడ్డు మరమ్మతు వంటి సాధారణ పనికి ఉపయోగించడం చూసి నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. బెంగుళూరు నగరంలో, ముఖ్యంగా వర్షాకాలం తర్వాత తరచూ ఎదురయ్యే గుంతల సమస్యపై ప్రజల్లో ఉన్న తీవ్ర అసంతృప్తికి ఈ సంఘటన అద్దం పడుతోందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. అఖిల్ చేసిన పని వింతగా ఉన్నా, ఒక ముఖ్యమైన సమస్యను వెలుగులోకి తెచ్చిందని ప్రశంసిస్తున్నారు.

### ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీకి వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 22 : రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీకి వత్తాసు పలుకుతున్నదని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ మండిపడ్డారు. బుధవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏ.ఐ.ఎస్.బి. రాష్ట్ర కార్యదర్శి హకీం నవీద్, పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహా రావు, ఏఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషాబోయిన సంతోష్, పి.డి.ఎస్.యు. హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్ లు పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని అరికడుతామని, పేద, మధ్యతరగతి ప్రజలకు ఫీజుల భారం లేకుండా చూస్తామని చెప్పిన మాటలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి. ప్రైవేట్ విద్యాసంస్థల్లో వసూలు చేస్తున్న ఫీజుల వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో పెట్టాలని విద్యాశాఖ అధికారులకు చెప్పిన ప్రతిపాదనలు నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ప్రభుత్వ నియమ ,నిబంధనలు యధేచ్ఛగా ఉల్లంఘిస్తూ కొనసాగు తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకొని వాటి గుర్తింపును రద్దు చేయడంలో సంబంధిత విద్యాశాఖ అధికారు లు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. సేవా దృక్పథం పేరిట విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకున్న ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ నేడు విద్యారంగాన్ని పూర్తిగా వ్యాపారమయం చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు బి.వంశీకృష్ణ, బి.బాలకృష్ణ, శ్రీపతి వినయ్, రామ్‌చరణ్, బొజ్జ జ్యోతి, రోహిత్, సతీష్, నాగరాజు, డానియల్, శ్రీకాంత్, హేమంత్ పాల్గొన్నారు.




# వాతావరణ హెచ్చరికలు గుణపాఠం కావాలి !

భగభగమండుతున్న ఎండలు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత విపరీతంగా ఉంది. దీనికితోడు ఈ యేడు వర్షాలు కూడాతక్కువేనని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ అసమతుల్యత కారణంగా ఇలా జరుగుతోంది. ఏటా హెచ్చరికలు వస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు బాధ్యత లేకుండా పోతోంది. అదేపనిగా నదుల్లో నుంచి ఇసుకను తోడేస్తున్నారు. కొండలను పిండి చేస్తున్నారు. అడవులను నరికి వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది. బయటకు వెళితే ఎక్కడైనా చెట్టునీడ కనిపించడం లేదు. ఇకపోతే ఇప్పటికే రైతులకు ఎరువులు అందడం లేదు. నీటి పారకం తగ్గింది. వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నీటిని సక్రమంగా వాడుకునే పద్ధతులు నేటికీ అమలు కావడం లేదు. అధికంగా ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతోంది. ఒకవైపు అమెరికా యుద్ధోన్మాదం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ ఈపాటికే హెచ్చరించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే, జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చుని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. పరిస్థితులను ముందే గమనించి వచ్చే వర్షాకాలానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. సాగునీటికి అవసరమైన వర్షాలు ఎలా ఉన్నా మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందు చూపుతో ఆధారపడి ఉన్నాయి. ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వల్ల, విత్తనాలూ, ఎరువులూ సమకూర్చక పోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను గుర్తించి ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకుల సంక్ష్యం కావాలి. ఏటా ఖరీఫ్ కాలం అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా చూస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే అయినా పాలకులు దృష్టిలోపం కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంటోంది. జనాభా అత్యధికంగా ఉన్నా రైతులకు కూలీలు దొరకడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోడంతో యువరైతులు వ్యవసాయం వదిలేస్తున్నారు. చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం సమస్యగా మారింది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప- అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. సాగుకు అవసరమైన పరిస్థితులను కల్పించాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించాలి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ పాలకులు ముందుచూపుతో సాగాలి. ఇకపోత తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ వేసవిలో సమస్య తీవ్రత కనిపిస్తోంది. తెలంగాణ, ఎపిల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ఆకళింపు చేసుకుని సాగాలి. ఈ రెండు నెలల పాటు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# ఆర్థిక ఆయుధంగా ఇరాన్



న్యూఢిల్లీ, : ఇరాన్?అమెరికా మధ్య ఉద్రిక్తతలు హోర్మూజ్ జలసంధిని కేంద్రంగా మరింత తీవ్రస్థితి చేరాయి. చర్చలు విఫలమై, ఇరాన్ జలసంధిపై కఠిన నియంత్రణలు ప్రకటించింది. ప్రపంచ చమురు సరఫరా దీనిపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఆర్థిక ఆందోళనలు పెరుగుతున్నాయి. ఇస్లామాబాద్‌లో 21 గంటల సుదీర్ఘ చర్చలు ఫలితం లేకుండా ముగిశాయి. అమెరికా అణు కార్యక్రమంపై 20 సంవత్సరాల ఫ్రీజ్, జలసంధి దిగ్బంధనాలు డిమాండ్ చేసింది. ఇరాన్ ఇజ్రాయెల్, అమెరికా 'అర్థరహిత' షరతులను తిరస్కరించి, యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ చేసింది. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 'ఇరాన్‌కు బ్యాడ్ న్యూస్' అని హెచ్చరించారు. ఈ క్రమంలో ఇరాన్ శత్రుదేశాలకు షాక్ ఇచ్చేలా కొత్త చట్టం రూపొందిస్తోంది. ఇరాన్ సంయుక్త సైనిక ఆదేశాలు జలసంధిని తమ పూర్తి నియంత్రణలో ఉంచుతూ, అమెరికా దిగ్బంధనాలు ఉన్నంతకాలం రవాణాను అడ్డుకుంటామని ప్రకటించాయి. గత 50 రోజుల్లో ఆంక్షలు విధించి, ఇటీవల తెరిచినా మళ్లీ మూసివేశారు. ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాకు ఇది కీలయం. తాజా నిర్ణయంతో చమురు రవాణాకు బ్రేక్ పడింది. పార్లమెంటరీ సివిల్ ఇంజనీరింగ్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రెజాయ్ కూచీ ప్రకటించిన ముసాయిదా తుది దశలో ఉంది. ఇజ్రాయెల్ సంబంధ నౌకలపై పూర్తి నిషేధం ఉంటుంది. హర్మూజ్ దాటాలంటే జాతీయ భద్రతా మండలి అనుమతి తీసుకోవాలి. యుద్ధం కారణంగా జరిగిన నష్టానికి పరిహారం చెల్లించకపోతే ప్రయాణానికి అనుమతి ఇవ్వరు. రవాణా రుసుము ఇరాన్ కరెన్సీలో మాత్రమే చెల్లించాలి. భద్రత 'ఉచితం కాదు' అని ఉపాధ్యక్షుడు మహ్మద్ రెజా ఆరిఫ్ హెచ్చరించారు. ఇరాన్ నిర్ణయంతో చమురు ధరలు 100-120 డాలర్ల వరకు రికార్డు స్థాయిలు చేరాయి. హర్మూజ్ మూసివేతతో 20 శాతానికిపైగా పెరిగే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల నుంచి 40 శాతంపైగా చమురు దిగుమతి చేసుకునే భారత్ ఇప్పుడు ఆఫ్రికా, రష్యా నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుటటోంది. మరోవైపు పెట్రోల్?డీజిల్ ధరలు 15?90 శాతం పెరిగాయి. చైనా, యూరప్‌లో కూడా ఇంధన కొరత పెరుగుతోంది. మధ్యప్రాచ్య చమురుపై ఆధారపడి ఉన్న భారత్‌లో పెట్రో ఉత్పత్తుల ధరలు ఆకాశతాకుతాయి. ఇరాన్ ప్రతీకార వ్యూహం ఆర్థిక ఆయుధంగా మారింది. చర్చలు ఆలస్యమైతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు. భారత్ వంటి దేశాలు వైవిధ్యమైన మూలాలపై దృష్టి పెట్టాలి.

# జాతీయ పార్టీగా జనసేన

అనంతపురం, : జనసేన నాయకత్వం ఒక పద్ధతి ప్రకారం ముందుకు వెళ్తోంది. ఏపీలో కూటమిపరంగా అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ.. ఇప్పుడు దక్షిణాది రాష్ట్రాలపై దృష్టి పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. పార్టీ విస్తరణ పై సరవేగంగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో కేరళలో ఆ పార్టీ విస్తరణ జరిగింది. ఆ రాష్ట్రంలో వివిధ పార్టీల్లోని 200 మంది నేతలు జనసేనలో చేరడంవిశేషం. జనసేన అగ్ర నేతలు నాగబాబు, రామ్ తాళ్లూరిల సమక్షంలో కేరళలో జనసేనలో చేరికలు పెరిగాయి. కేరళ నుంచి వచ్చిన వినతులు మేరకు పవన్ కళ్యాణ్ స్పందించారు. నాగబాబు తో పాటు రామ్ తాల్లూరిలను అక్కడకు పంపించారు. అయితే కేరళలో పెద్ద ఎత్తున నేతలు జనసేనలో చేరడం ఇప్పుడు కొత్త ప్రచారానికి తెరతీసింది. మున్ముందు జనసేన రాజకీయ ప్రయాణం దక్షిణాది రాష్ట్రాల్లో విస్తరించనుందని అర్థమవుతోంది. పవన్ కళ్యాణ్ఎప్పుడు దూకుడు రాజకీయాలు చేయలేదు. జనసేన పరంగా దూకుడుగా అడుగులు వేయలేదు. ముందుగా ఏపీలో సిద్ధాంత పరంగా ముందుకు వెళ్లారు. సంప్రదాయ రాజకీయ పార్టీ మాదిరిగా అస్సలు వ్యవహరించలేదు. తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చితేనే కొనసాగాలని కుండబద్దలు కొట్టారు నాయకులకు. భారతీయ జనతా పార్టీ మాదిరిగా సిద్ధాంత పరంగా జనసేనను నిలబెట్టాలని చూశారు. ఈ క్రమంలో హిందుత్వ వాదాన్ని, సనాతన ధర్మ పరిరక్షణ నినాదాన్ని అందుకున్నారు. దీని వెనుక లోతైన వ్యూహం ఉంది. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. కానీ బలమైన సిద్ధాంతాల నడుమ అవి కొనసాగుతున్నాయి. తమిళనాడులో ద్రవిడ సిద్ధాంతం పూర్తిగా రాజకీయ పార్టీలను కబలించింది. అటువంటి చోట సనాతన ధర్మం అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసి.. ఒక వర్గం ప్రజలను ఆకర్షించగలిగారు పవన్ కళ్యాణ్. ఇప్పుడు అదే వ్యూహంతో దక్షిణాది రాష్ట్రాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు. ఇప్పుడు కేరళలో అది వర్క్ అవుట్ అయ్యేలా కనిపిస్తోంది. పెద్ద ఎత్తున నేతల చేరిక.. తిరువనంతపురంలోజరిగిన జనసేన సమావేశంలో చాలామంది నేతలు ఆపార్టీలో చేరారు. ప్రధానంగా నేషనల్‌లేబర్ పార్టీ, హిందుస్థాన్ అవామీ మోర్చా, ఆల్ ఇండియా ముస్లిం లీగ్ పార్టీ, లోక్ జనశక్తి పార్టీ, రాష్ట్రీయలోక్ దళ్, కాంగ్రెస్ పార్టీలనుంచి 200మందికి పైగా నాయకులు, కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. అయితే ఈ ఉత్సాహం చూస్తుంటే మాత్రం తదుపరి లక్ష్యంగా కర్ణాటక పై దృష్టి పెట్టే ఛాన్స్ కనిపిస్తోంది. క్రమేపి తమిళనాడుతో పాటు తెలంగాణలో కూడా పార్టీ విస్తరించి.. జాతీయ పార్టీగా అవతరించే దిశగా అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా పవన్ కళ్యాణ్ భావజాలం భాషలతో పాటు ప్రాంతాలకు అతీతంగా దేశస్థా యిలో ప్రజలను ఆకట్టుకుంటుందని జనసేన నాయకత్వం భావిస్తోం ది. చూడాలిమరి ఆ పార్టీ ప్రయత్నాలుఎంతవరకు సక్సెస్ అవుతాయో..

## మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ (తెలంగాణ వాణి) కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ, అంబేద్కర్ నగర్ వాసులు ఎదుర్కొంటున్న ఇంటి నిర్మాణ పన్నులు, జరిమానాల గురించి సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ ని కలిసి సమస్య వివరించడం వినతి పత్రము అందజేయడం జరిగింది. వారి సమస్యలు పూర్తిగా విన్న సైబరాబాద్ కమిషనర్ సృజన , జరిమానాలు వేసిన సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్యను పూర్తిస్థాయి లో పరిష్కరిస్తానని తెలియజేశారు. అదే విధంగా కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ఆరు సర్కిలలో చేపట్టవలసిన అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర వివరాలను సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ అందజేశారు.

ఈ పనులు ప్రభుత్వం నుండి మంజూరైనప్పటికీ ప్రస్తుతం కొన్ని టెండర్ ప్రక్రియలో ఆగిపోవడం జరిగిందని వాటిని వేగవంతం చేసి పనులు ప్రారంభించాలని కమిషనర్ కోరారు, కమిషనర్ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్, బుచ్చిరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆగం పాండు, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, మోటే శ్రీనివాస యాదవ్ అరువ వెంకట్, సాయికిరణ్, గోపాల్ రెడ్డి గుమస్తా మధుసూదన్ , వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామ్ రెడ్డి, సభ్యులు ఎన్ వి రెడ్డి, కృష్ణ, రాము, బుచ్చిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మాణిక్య రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణలో పెరగనున్న.. భూముల ధరలు



హైదరాబాద్, : తెలంగాణలో భూముల మార్కెట్ విలువలను సవరించేందుకు రేవంత్ సర్కార్ రెడీ అయింది. వ్యవసాయ భూముల విలువ గరిష్టంగా 300 శాతం పెరగనుండగా.. ఓఆర్ఆర్ పరిసరాల్లోని ప్లాట్ల రేట్లు మూడింతలు కానున్నట్లు తెలిసింది. అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరలను స్వల్పంగా పెంచి.. కమర్షియల్ స్పేస్ రేట్లను మాత్రం తగ్గించాలని ప్రతిపాదించారు. రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం అనంతరం ఈ కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడమే కాకుండా రియల్ రంగంలో పారదర్శకత రానుంది. తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపునిచ్చేలా రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకునేందుకు రెడీ అయింది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, నివాస స్థలాల మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో లేదా జూన్ నుంచి ఈ పెరిగిన ధరలు అమల్లోకి వచ్చేఅవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల విలువను సవరించడం ఇదే తొలిసారి కావడంతో రియల్ ఎస్టేట్ రంగంలో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం.. వ్యవసాయ భూముల మార్కెట్ విలువ గరిష్టంగా రెండు నుంచి మూడు రెట్లు పెరగనుంది. ప్రస్తుతం ఎకరాకు రూ. 6 లక్షలుగా ఉన్న విలువ రూ. 12 లక్షల నుంచి రూ. 18 లక్షల వరకు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా నగర శివార్లలోని కోర్‌అర్బన్ ప్రాంతాల్లో మార్కెట్‌విలువ బహిరంగ మార్కెట్ రేట్ల కంటే చాలా తక్కువగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఎకరా విలువ ప్రభుత్వ లెక్కల్లో రూ. 20 లక్షలు ఉంటే.. బయట రూ. 10 కోట్ల నుంచి రూ. 20 కోట్లు పలుకుతోంది. ఇలాంటి చోట్ల మార్కెట్ విలువను ఏకంగా 300 శాతానికి పైగా పెంచి అసమానతలను తగ్గించాలని సర్కార్ భావిస్తోంది. ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. రీజినల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టుల వల్ల ఈ ప్రాంతాల్లో భూములకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. దీనికి అనుగుణంగానే ఇక్కడి ఓపెన్ ప్లాట్లు, నివాస స్థలాల ధరలను 2 నుంచి 3 రెట్లు పెంచను న్నారు. అలాగే అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్ల విలువను కూడా స్వల్పంగా పెంచనున్నారు. ప్రస్తుతం ఎస్ఎఫ్‌టీకి రూ. 2,200 ఉన్న ధరను రూ. 2,800 కు పెంచే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో రిజిస్ట్రేషన్ ఖర్చులు పెరిగినప్పటికీ.. బ్లాక్ మనీ లావాదేవీలు తగ్గి పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. నివాస స్థలాల రేట్లు పెరుగుతున్నా, వాణిజ్య స్థలాల విషయంలో ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మార్కెట్ రేట్ల కంటే ఎక్కువగా ఉన్న కొన్ని ప్రాంతాల్లో కమర్షియల్ స్పేస్ విలువను తగ్గించాలని ప్రతిపాదించారు. ఎస్ఎఫ్‌టీకి రూ. 7 వేలుఉన్న విలువను రూ. 6,500 కి తగ్గించే అవకాశం ఉంది. దీనివల్ల కొత్త కంపెనీలు, పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేందుకు ఆసక్తి చూపుతాయని తద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. కేబినెట్ సబ్ కమిటీ అధ్యయనం తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది.

# కాంగ్రెస్ కంచుకోటలకు బీటలు



చెన్నై, : దాదాపు 50 ఏళ్ల తర్వాత లోక్‌సభ సీట్లు పెంచేందుకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఓ ప్రయత్నం చేసింది. ప్రస్తుతం ఉన్న 543 సీట్లు 1977లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినవే. తాజాగా 130వ రాజ్యాంగ సవరణ ద్వారా లోక్‌సభ స్థానాలు 816కు పెంచడంతోపాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించింది. ఈమేరకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టింది. అయితే ఈ బిల్లే కాంగ్రెస్‌ను భయపెట్టింది. ఈ బిల్లు ఆమోదం పొందితే కాంగ్రెస్ భవిష్యత్ ప్రశ్నార్థకమవుతుంది. ఉనికే లేకుండా పోతుంది. అందుకే కాంగ్రెస్ విపక్షాలను ఏకం చేసి బిల్లును వ్యతిరేకించడంలో విజయవంతమైంది. కాంగ్రెస్ 50 ఏళ్ల పాలనలో తమ అనుకూలంగా సీట్లను ఒకటిగా, వ్యతిరేక సీట్లలో ఓటర్లను విభజించి అనుకూల నియోజకవర్గాల్లో కలపడం వంటివి చేసింది. తెలంగాణలో 2008?09 పునర్విభజనలో హైదరాబాద్ హిందూ ఓటర్లను ముస్లిం బలమైన పాత్‌బస్తీ ప్రాంతాలతో కలిపి బీఆర్ఎస్, బీజేపీ ఓట్లు చీలేలా చేశారు. 90 కి.మీ. దూరంలోని తాండూర్‌ను హైదరాబాద్ లోక్‌సభ సీటుకు చేర్చి ముస్లిం ఓట్లు బలోపేతం చేశారు. పశ్చిమ బెంగాల్, కేరళలో ముస్లిం, క్రిస్టియన్ ప్రాంతాల సీట్లు పెంచి, హిందూ బలమైన దక్షిణ కేరళలో సీట్లు తగ్గించారు. శ్రీరంగంలో బ్రాహ్మణులు గెలవకుండా విభజనలు చేశారని విమర్శలు వచ్చాయి. కేంద్రం మూడు బిల్లులు ప్రవేశపెట్టింది. డీలిమిటేషన్ బిల్లు?2026, మహిళా రిజర్వేషన్, కేంద్రపాలిత ప్రాంతాల సీట్ల పెంపు. లోక్‌సభ సీట్లు 50 శాతం పెంచి 816?850కి, రాష్ట్రాలకు 815, యూటీలకు 35 సీట్లు కేటాయించాలని ప్రతిపాదన. జూన్‌లో డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు, 84వ సవరణను సవరించి 2011 డేటాతో ముందుకు సాగాలని భావించింది. ఉత్తరప్రదేశ్‌కు 120 సీట్లు, తెలంగాణకు 25, ఏపీకు 38 సీట్లు పెరిగే అవకాశం. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సీట్లు పెరుగుతాయని కేంద్రం చెబుతోంది. తెలంగాణ, తమిళనాడు సీఎంలు దక్షిణ రాష్ట్రాల సమతౌల్యం దెబ్బతింటుందని వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఎంపీ సీట్ల మార్పు ఎమ్మెల్యే సీట్లను కూడా ప్రభావితం చేస్తుంది. ఉత్తర రాష్ట్రాల జనాభా ఆధారంగా సీట్లు పెరిగి దక్షిణానికి నష్టం అవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇండియా కూటమి, మల్లికార్జున్ ఖర్గే దీన్ని రాజ్యాంగ విరుద్ధ కుట్రగా, బీజేపీ హైజాక్ ప్రయత్నంగా విమర్శిస్తోంది. కేసీ వేణుగోపాల్ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఇది జన హితమని, కాంగ్రెస్ గతంలో జనాభా ఆధారం మర్చినట్టు ఆరోపిస్తోంది. ఈ పునర్విభజన దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చనుంది. కాంగ్రెస్ తన 'కంచు కోటలు' కుప్పకూలుతాయని భయపడుతోంది. బీజేపీ మతపరమైన పోలరైజేషన్‌కు అనుకూలంగా మారవచ్చని ఆరోపణలు ఉన్నాయి. భవిష్యత్ ఎన్నికల్లో పార్టీల బలాలు పూర్తిగా మారే అవకాశం ఉంది.

## అప్పు ఇచ్చేందుకు నిరాకరణ..

### రిటైర్డ్ ఆర్బీఐ ఉద్యోగిని హత్య చేసిన దంపతులు

న్యూఢిల్లీ: రిటైర్డ్ ఆర్బీఐ ఉద్యోగిని దంపతులు అప్పు అడిగారు. ఆయన నిరాకరించడంతో ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తిని హత్య చేశారు. దర్యాప్తు చేసిన పోలీసులు భార్యాభర్తలను అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. 63 ఏళ్ల మాధో రామ్ రిటైర్డ్ ఆర్బీఐ ఉద్యోగి. భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడుతో కలిసి మందిర్ మార్గ్ ప్రాంతంలో నివసిస్తున్నాడు. కాగా, ఏప్రిల్ 19 ఆదివారం సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంటి మొదటి అంతస్తులోని గదిలో కత్తి గాయాలతో మాధో రామ్ పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అతడ్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మరోవైపు మాధో రామ్ హత్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఫోరెన్సిక్ బృందం సంఘటనా స్థలాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసింది. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. అలాగే స్థానికుల నుంచి సమాచారాన్ని సేకరించారు. దీంతో భార్యాభర్తలైన ఆజాద్ అలియాస్ జాజు, అతడి భార్య రుబీనాను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. కాగా, గోల్ మార్కెట్ ప్రాంతంలో నివసించే ఆజాద్ టైలర్‌గా పనిచేస్తున్నాడని పోలీస్ అధికారి తెలిపారు. ఆదివారం సాయంత్రం అప్పు కోసం మాధో రామ్‌ను అతడు కలిసినట్లు చెప్పారు. డబ్బు ఇచ్చేందుకు నిరాకరించడంతో వారి మధ్య వాగ్వాదం జరిగిందని అన్నారు. ఈ నేపథ్యంలో ఆజాద్ కత్తితో మాధో రామ్‌ను పొడిచి పారిపోయినట్లు వివరించారు. అయితే ఆజాద్ భార్య రుబీనా సాక్ష్యాలను నాశనం చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. రక్తం మరకలు ఉన్న ఆజాద్ దుస్తులను ఆమె ఉతికిందని చెప్పారు. నేరాన్ని అంగీకరించిన నిందితులైన భార్యాభర్తలను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.




# వ్యక్తిగత దూషణల్లో నేతలు.. ఇద్దరూ.. ఇద్దరే

హైదరాబాద్, : దేశంలో మిగతా రాష్ట్రాలు వేరు.. తెలంగాణ వేరు. తెలంగాణ ఉత్తి పుణ్యానికి రాలేదు. బలిదానాల మీద.. ఆత్మ త్యాగాల మీద వచ్చింది. ఆశయాల సాధన మీద ఏర్పడింది. అందుకే తెలంగాణ అంటే ఒక పౌరుషం.. తెలంగాణ అంటే బలమైన ఆశయం. తెలంగాణ అంటే పిడికిలి బిగించిన నినాదం. సబ్బండవర్ణాలు రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు, నిరసనలు, మిలియన్ మార్చ్ లు, వంటావార్పులు చేస్తేనే తెలంగాణ ఏర్పడింది. అతడు తెలంగాణలో నాయకులు మాట్లాడుతున్న మాటలు చూస్తే జాలి కలుగుతుంది. తెలంగాణలో మర్యాదలు ఎక్కువ గా ఉంటాయి. వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగితే తిట్టే తిట్లు కూడా అదే స్థాయిలో ఉంటాయి. ఉద్యమాన్ని శంకించిన వారికి.. తెలంగాణ ప్రజల నుంచి ఎటువంటి తిట్లు ఎదురయ్యాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అటువంటి సామాజిక ఐక్యత తెలంగాణ ప్రజల్లో నిండి ఉంది కాబట్టి స్వరాష్ట్ర సాధన సాధ్యమైంది. అంతటి గొప్ప విద్వత్తు ఉన్న తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ నాయకులు మాట్లాడుతున్న మాటలు బాధ కలిగిస్తున్నాయి. ఇందుకేనా తెలంగాణ తెచ్చుకున్నది అనే ఆవేదనను వ్యక్తం చేస్తున్నాయిరాజకీయ నాయకులు అధికారం కోసం మాత్రమే పాకులాడుతారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి అనేది వట్టి మాటలు మాత్రమే. ఏదో రాజకీయ ప్రాపకం కోసం అభివృద్ధి చేసినట్టు.. సంక్షేమానికి పాటుపడినట్టు కలరింగ్ ఇస్తుంటారు. లేకపోతే 2014లో మిగులు బడ్జెట్ తో తెలంగాణ ఏర్పడింది. కెసిఆర్ దిగిపోయే నాటికి రెవెన్యూ లోటుకు దిగజారింది. రేవంత్ పరిపాలనలో కూడా అదే సన్నివేశం కొనసాగుతోంది.. పదవి విరమణ చేసిన ఉద్యోగులకు కనీసం రిటైర్మెంట్ బెనిఫిషరీస్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. దీనిని బట్టి తెలంగాణఆర్థిక పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు..త్యాగాల మీద ఏర్పడిన తెలంగాణ ఇలా కావడానికి ముమ్మాటికి రాజకీయ నాయకులు కారణం. అధికారకాంక్ష.. స్వార్థం.. భారీగా వెనకేసుకోవడం వంటివాటి వల్ల తెలంగాణ సంపద మొత్తం రాజకీయ నాయకుల జేబుల్లోకి చేరిపోయింది. మద్యం అమ్మకాలు గనుక లేకుంటే తెలంగాణలో ఉద్యోగులకు వేతనాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. నిష్టూరంగా ఉన్నప్పటికీ ఇదే కఠిన నిజం. రాజకీయ నాయకుల వ్యవహార శైలి వల్ల తెలంగాణ పరువు పోతోంది అని చెప్పుకున్నాం కదా.. అది మరోసారి నిరూపితమైంది.. జగిత్యాల సభలో కేసీఆర్ కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి ఏం బీమారివచ్చింది? ఏ మాయ రోగం? లాగులు ఇడ్చి కొట్టాలే.. నన్ను ఏం చేస్తావ్ నా కొడకా..ఇటువంటి మాటలుమాట్లాడారు. వాస్తవానికి కెసిఆర్ నుంచి ఇంతకంటే గొప్పగా తెలంగాణ సమాజం ఆశించదు. కఠినంగా ఉన్నప్పటికీ ఇదే నిజం. కాకపోతే కెసిఆర్ గత సంభాషణలు ఉంటే ఆయన నోటి నుంచి వచ్చిన ఆణిముత్యాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం అవుతుంది. రేవంత్ రెడ్డి కూడా ఇందులో తక్కువ తినలేదు. భూపాలపల్లి జిల్లాలో జరిగిన బహిరంగ సభలో జీవన్ రెడ్డిని గట్టిగానే తిట్టారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసింది.. జీవన్ రెడ్డి ఎందుకు మోసం చేశాడు.. అనే అంశాలపై రేవంత్ లోతుగానే మాట్లాడారు. కొన్ని సందర్భాలలో రేవంత్ రెడ్డి అదుపుతప్పారు. ఇక కెసిఆర్ ను కూడా అదే స్థాయిలో విమర్శించారు. కర్కోటకుడు అని సంబోధించారు. పాపాత్ముడు అంటూ మండిపడ్డారు.. కెసిఆర్ లాంటి ద్రోహిని వదిలిపెట్టే సవాల్ లేదని శపథం చేశారు. అటు రేవంత్ రెడ్డి, ఇటు కెసిఆర్ సీనియర్ నాయకులు. తిట్టుకుంటూనే రాజకీయమంటే అంతకు మించిన మూర్ఖత్వం ఉండదు. వ్యక్తిగత కోపాలు ఉంటే నేరుగా తేల్చుకోవాలి. అలాకాకుండా జనాన్ని ప్రభావితం చేసే విధంగా మాట్లాడటం ఎందుకు. రాజకీయాలు అంటే వ్యక్తిగత కక్షలకు వేదికలు కావు కదా.. విధానాలపరంగా నేతలను విమర్శించాలి. ఏవైనా తప్పులు చేస్తే ఎండగట్టాలి. అక్రమాలకు పాల్పడితే న్యాయస్థానాలకు ఈడ్చాలి. అలా కాకుండా ఇలా తిట్టుకోవడం.. వ్యక్తిగత దూషణలకు పాల్పడటం ఎటువంటి రాజకీయాలకు నిదర్శనమో కెసిఆర్, రేవంత్ రెడ్డి చెప్పాలి. ఇటువంటి రాజకీయాల కోసం కాదు తెలంగాణ తెచ్చుకుంది.



# పిచికారీ భారం.. సౌర యంత్రాలే పరిష్కారం..

**రైతు భుజాలపై కిలోల బరువు ఇంకెన్నాళ్లు...? సాంకేతిక పరిష్కారాలపై దృష్టి సారించాలి..?**

మన దేశంలో వివిధ పంటల సంరక్షణలో అత్యంత కీలకమైన పురుగు మందుల పిచికారీ ప్రక్రియ రైతులకు ఇప్పటికీ శ్రమతో కూడుకున్నప్రహసనంగా మిగిలిపోయింది. వీపు వెనుక మోసే నాప్‌సాక్ స్ప్రేయర్ ల ద్వారా పురుగు మందులను పిచికారి చేయడానికి రైతులు గంటల తరబడి ఎండలో కష్టపడే దృశ్యాలు గ్రామీణ భారతంలో ఇప్పటికీ సర్వ సాధారణంగా కనిపిస్తుంది. రోజుకు 5--6 గంటలకంటే ఎక్కువ పని చేయలేని వీపు వెనుక మోసే ఈ పరికరాలు రైతు శక్తిని దోచేస్తున్నాయి. ఇంధన ఆధారిత స్ప్రేయర్లు ఒకవైపు ఖర్చుతో పాటు మరోవైపు అవి అన్ని చోట్లా అందుబాటులో ఉండకపోవడమే గాక, వాటిని రిపేరు చేయించడంలోనూ రైతులు సమస్యలను ఎదుర్కొనే పరిస్థితులు నిత్య కృత్యమే. ఈ పరిస్థితులకు స్వస్తి పలికి మనదేశ రైతుల భుజాలపై మోస్తున్న పిచికారి పంపుసెట్ల భారాన్ని తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రత్యామ్నాయ.. డ్రోన్ స్ప్రేయర్‌లు.. కానీ ఖర్చు అధికం...: ఇప్పటికే పంటలను పాడు చేసే పురుగులు, కీడల నుండి కాపాడేందుకుగాను పురుగు మందులను చల్లేందుకుగాను అత్యాధునిక సాంకేతికతతో కూడిన డ్రోన్ ఆధారిత స్ప్రేయర్‌లు అందుబాటులోకి వచ్చాయి. కానీ ఈ విధానం అధిక ఖర్చుతో కూడుకుని ఉండడంతో ఎక్కువ మంది రైతులు వాటిని వినియోగించుకోలేని పరిస్థితులున్నాయి. మన దేశంలో ఎక్కువ సంఖ్యలో ఉన్నది చిన్న, సన్నకారు రైతులే కావడం వల్ల ఎక్కువ ఖర్చుతో కూడుకున్న డ్రోన్ ఆధారిత పిచికారి విధానాన్ని పాటించే రైతుల సంఖ్య చాలా తక్కువే. అందువల్ల అత్యధిక సంఖ్యలో ఉన్నటువంటి చిన్న, సన్నకారు రైతులకు సైతం అందుబాటులో ఉండే పిచికారి విధానాలను ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకోసం సహజ ఇంధన వనరుగా సౌర శక్తిని వినియోగించుకునే యంత్రాలను ఆవిష్కరించాలి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, సౌర శక్తిని ప్రత్యామ్నాయ సహజ ఇంధనంగా వినియోగించుకుని రైతులు సులువైన విధంగా పంటలకు చీడ, కీడలు రాకుండేందుకుగాను నూతన పిచికారి విధానాలు అలవరచుకుంటే ఎంతో మేలు కరంగా ఉంటుంది. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారంగా పాత పిచికారి విధానానికి స్వస్తి పలికే విధంగా, తక్కువ ఖర్చు, తక్కువ శ్రమతో కూడినవిగా ఉండే నూతన ఆవిష్కరణలు అవసరం ఉంది. తక్కువ వ్యయంతోనే తయారు చేయగలిగే అవకాశం ఉన్న సౌర శక్తితో పనిచేసే స్ప్రేయర్ వాహనాలను అందిస్తే రైతులకు ఎంతో మేలుకరంగా ఉంటుంది.

సోలార్ స్ప్రేయర్..: ఇటీవల సౌర శక్తితో పనిచేసే స్ప్రేయర్ వాహనం గురించి ఒక అధ్యయనంలో రైతుకు ఒక కొత్త మార్గాన్ని చూపుతున్నట్లు గమనించాను. ఈ వాహనం సూర్యకాంతిని విద్యుత్తుగా మార్చే సోలార్ ప్యానెల్లు పిచికారీకి అవసరమైన శక్తిని అందించడమే కాకుండా, రైతుకు నీడను కూడా ఇచ్చే విధంగా రూపొందించినట్లు గమనించాను. ఐదు నాజిల్స్‌తో కూడిన ఈ స్ప్రేయర్ వ్యవస్థ పంటలపై సమానంగా మందులు చల్లుతుందని పరిశీలకులు తమ అధ్యయనంలో అంచనా వేశారు. ఈ స్ప్రేయర్ ద్వారా రసాయనాల వినియోగంలో వృథా తగ్గడమే గాక పంటల ఆరోగ్యం మెరుగుపడే అవకాశాలుంటాయి. సదరు అధ్యయనంలో ఒకే ట్యాంక్‌తో సుమారు 315 చదరపు మీటర్ల విస్తీర్ణాన్ని కవర్ చేయగలగడమే గాక ఒక ఎకరాన్ని 90 నిమిషాల్లో పిచికారీ పూర్తి చేయగలిగిన సామర్థ్యం ఈ యంత్రానికి ఉంటుందని ఒక పరిశోధక జర్నల్‌లో పరిశీలకులు స్పష్టం చేశారు.

అంతేగాక ఈ యంత్రం తయారీకి అయ్యే ఖర్చు కూడా భారీగా ఉండబోదని, 25 వేల రూపాయలకు మించకుండా యంత్రాన్ని తయారు చేయవచ్చని పేర్కొన్నారు. సౌర స్ప్రేయర్ వాహనం కేవలం ఒక పరికరం కాదు. ఇది రైతు శ్రమను తగ్గించే సాధనం. ఇది పర్యావరణానికి మేలు చేసే మార్గం. ఇది వ్యవసాయాన్ని స్థిరంగా మార్చే ఒక అవకాశం. రైతు శ్రమ తగ్గించడానికి ఇలాంటి పరికరాలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. తక్కువ ఖర్చుతో లభించే సాంకేతికత రైతు చేతికి చేరాలి. పర్యావరణ హిత పరిష్కారాలపై చర్యలు తీసుకోవాలి.

ప్రభుత్వం చొరవ కీలకం.. సబ్సిడీలతో మరింత ప్రోత్సాహం... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరుత్పాదక శక్తిపై పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నాయి. కానీ క్షేత్ర స్థాయిలో ఇలాంటి ఉపయోగకరమైన పరికరాలు విస్తారంగా సన్నకారు రైతులకు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉంది. ఇలాంటి వాటికి సబ్సిడీలు, ప్రత్యేక ప్రోత్సాహకాలను ఇవ్వడం ద్వారా ప్రభుత్వాలు వినూత్న ఆవిష్కరణలకు ఊతం అందించాలి. అవగాహన కార్యక్రమాలు రైతులందరికీ చేరే విధంగా ప్రణాళికలు ఉండాలి. వ్యవసాయ యాంత్రీకరణ అంటే కేవలం పెద్ద యంత్రాలకే పరిమితం కాకూడదు. తక్కువ ఖర్చులో ఎక్కువ ప్రయోజనం చేకూర్చే విధమైన నూతన ఆవిష్కరణలు వ్యవసాయాన్ని స్థిరంగా మార్చడానికి ఊతమందిస్తాయి. రైతు శ్రమ తగ్గించడానికి ఇలాంటి పరికరాలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. తక్కువ ఖర్చుతో లభించే సాంకేతికత రైతు చేతికి చేరాలి. పర్యావరణ హిత పరిష్కారాలపై చర్యలు తీసుకోవాలి. పాత పద్ధతుల భారాన్ని మోస్తూ రైతు ఇంకా ఎంతకాలం ముందుకు సాగాలి? మార్పు అవసరం అనిపిస్తున్నప్పుడే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

సౌర శక్తి ఉంది.. సాంకేతికత ఉంది.. అవసరమూ ఉంది... ఇక సంకల్పం మాత్రమే మిగిలింది. రైతు కష్టానికి గౌరవం ఇవ్వాలంటే మార్పు ప్రారంభం కావాలి. ప్రభుత్వం చొరవ తీసుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం చేకూర్చే విధమైన సౌర యంత్రాలను అందించడం ద్వారా రైతులకు మరింత మేలు చేయాలి.

**ఉదయ్ కుమార్. జి**
DAE, BA, BCJ, MCJ, LLB, MPhil., PhD
**సీనియర్ జర్నలిస్టు**
**ఫోన్ నెంబర్ 8367603197**

# శుభకార్యానికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల...



జడ్చర్ల: అర్ధరాత్రి వేల ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చొరబడి నగలు, నగదును అపహరించిన ఘటన పాలమూరు జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. జడ్చర్ల పట్టణం హౌసింగ్ బోర్డ్ కాలనీ రోడ్ నెంబర్ 7 లో మహమూద్ షేక్ వలి ఇంట్లో అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తులెవరో తరబడి నగలు, నగదును దొంగిలించారు. అయితే మహమ్మద్ షేక్ వలి కుటుంబీకులంతా శుభకార్యం నిమిత్తం రాత్రి 10 గంటల సమయంలో మహబూబ్ నగర్‌కి వెళ్లారు. తిరిగి తెల్లవారుజామున 3 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి తమ ఇంటిని గుర్తు తెలియని దుండగులు గుల్ల చేశారు. ఇంటి తాళాలు విరగొట్టి అనంతరం ఇంట్లో ఉన్న నాలుగు బీరువాల తాళాలు విరగొట్టి, సామాగ్రిని చిందర వందర చేసి రెండు తులాల బంగారంతో పాటు సుమారు పదివేల దాకా నగదును అపహరించారు. దీంతో ఇంటి యజమాని మహమ్మద్ షేక్ వలి ఫిర్యాదు మేరకు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన పి మౌనిక

**భుజస్కంధాలపై సింహ తలాటం చిహ్నాన్ని అలంకరించి అభినందనలు తెలియజేసిన జిల్లా ఎస్పీ**

**ఏఎస్పీ నుండి అదనపు ఎస్పీగా పదోన్నతి**



ఆదిలాబాద్, ఏప్రిల్ : 22 ( తెలంగాణ వాణి ప్రతినిధి ): పోలీసు కార్యాలయం అడ్మిన్ ఏఎస్పి గా ఉన్నటువంటి పి. మౌనిక కి సోమవారం అదనపు ఎస్పీగా పదోన్నతి రాగా, పోలీసు ముఖ్య కార్యాలయం నందు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన పిమౌనికకి పదోన్నతి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భుజస్కందాలపై సింహ తలాటం చిహ్నాన్ని అలంకరించి అభినందనలు తెలియజేశారు. ఇకనుండి పి మౌనిక పోలీసు ముఖ్య కార్యాలయం అదనపు ఎస్పీఅడ్మిన్ గా అదే స్థానంలో కొనసాగనుంది. జిల్లా పోలీసు సిబ్బంది ప్రత్యేకంగా పదోన్నతి పొందిన మౌనిక కి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి ఆపరేషన్ బి సురేందర్ రావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ పోతారం శ్రీనివాస్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, సీసీ కొండరాజు, ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50 కోట్లు

**ప్రజల శ్రేయస్సే లక్ష్యం – ప్రజాప్రతినిధులు సేవాభావంతో పనిచేయాలి**

**వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు**

**ఇల్లందు పర్యటనలో రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





ఇల్లందు (తెలంగాణ వాణి): ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటిడిఏ పీవో రాహుల్ తదితరులు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా మంత్రి ఇల్లందు 10వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తడికమల్ల భాగ్యమ్మ, కోడిమల్ల లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని, పూజలు నిర్వహించి లబ్ధిదారులతో కలిసి గృహాలను ప్రారంభించారు. అనంతరం ఇల్లందు మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన చైర్‌పర్సన్ గది ప్రారంభించి, చైర్‌పర్సన్ కిరణ్ మిత్రకు శుభాకాంక్షలు తెలిపారు. ఆపై మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇల్లందు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామని అన్నారు . ఇల్లందు అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేస్తామని ఇచ్చిన మాట ప్రకారం, త్వరలో రెండు విడతల్లో నిధులు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల శ్రేయస్సే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా అందరికీ సమానంగా అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ప్రతిరోజూ సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలతో నిత్యం సంబంధం పెంచుకుంటూ ఉదయం, సాయంత్రం సమయం కేటాయిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసం పని చేస్తుందని, ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని మంత్రి కోరారు. కొత్తగా ఎన్నికైన సభ్యులు అనుభవం లేదని భావించకుండా అధికారులతో సమన్వయం చేసుకొని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ మంత్రి నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలో 200 నుంచి 700 ఓట్ల మెజారిటీతో గెలుపొందారున్నారు. కొత్తగా వార్డు కౌన్సిలర్లు ప్రతి వార్డులో సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లా కలెక్టర్ అంకిత్‌మాట్లాడుతూ ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల్లో పారిశుద్ధ్యం, లైటింగ్, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో నీటి సమస్యలు లేకుండా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేస్తూ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖ ఫీడింగ్ రవీందర్ నాథ్, తాసిల్దార్ ఎంపీడీవో ధన్సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజు, మున్సిపల్ కమిషనర్ సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధే లక్ష్యం

**రూ.1.20 కోట్ల పనులకు శ్రీకారం**



నిర్మల్ – నర్సాపూర్ ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి): ముధోల్ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలిపారు. నర్సాపూర్ మండలంలోని తిమ్మాపూర్,గొల్లమాడ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి,మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.తిమ్మాపూర్‌లో రూ.90 లక్షలతో సీసీ రోడ్లు,పంచాయతీ భవనం తదితర పనులు ప్రారంభించగా, గొల్లమాడలో రూ.24 లక్షలతో చెరువు మరమ్మత్తులు చేపట్టారు. రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రాలను విస్తరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

# మైనారిటీ గురుకుల విద్యార్థుల అద్భుత ఫలితాలు అభినందనీయం

**విద్యార్థులు పోటీ పరీక్షలపై దృష్టి సారించాలి**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి:ఏప్రిల్,22(తెలంగాణ వాణి ప్రతినిధి): ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలలో మైనారిటీ గురుకుల విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పి. నరేష్ కుమార్ నాయుడు విద్యార్థులతో కలిసి బుధవారం జిల్లా కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఫలితాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, విద్యార్థులు సాధించిన ఫలితాలు జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి విద్యార్థిని వారి ఫలితాల గురించి అడగగా, విద్యార్థులు తమ మార్కులను వివరించారు. శాంతి 482/500, షీబా 480/500 మార్కులు సాధించినట్లు తెలిపారు. చంద్ర వైష్ణవి 491/500 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించి, టీజీ ఎంఆర్ఈఐఎస్ లో 1వ స్థానం పొందినట్లు పేర్కొన్నారు.కె. హర్షిత 485/500 మార్కులు సాధించగా, సువర్ణ రాణి 943/1000, నస్రీన్ 891/1000 మార్కులు సాధించినట్లు తెలిపారు. లక్ష్మీ ప్రసన్న 981/1000 మార్కులతో టీజీ ఎంఆర్ ఈఐఎస్ లో 2వ స్థానం పొందినట్లు, అఖిల 973/1000 మార్కులు సాధించినట్లు చెప్పారు. శివ సంజన శ్రీ హర్షిత ఇద్దరూ 455/470 మార్కులు సాధించగా, నిదా కౌనిన్ 990/1000 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. మనోగ్న 436/440 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించగా, రిమ్షా 964/1000 మార్కులు సాధించినట్లు వివరించారు. విద్యార్థులు సాధించిన ఈ ఫలితాలు రాష్ట్ర స్థాయిలో కూడా మంచి గుర్తింపు తీసుకువచ్చాయని కలెక్టర్ తెలిపారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలు సాధించవచ్చని ప్రోత్సాహం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర జీవధార కాళేశ్వరం : సుంకె రవిశంకర్

గంగాధర, ఏప్రిల్ 22 : తెలంగాణ రాష్ట్రానికి కాళేశ్వరం ప్రాజెక్టు జీవధార అని, తెలంగాణకు గుండెకాయ కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం అసత్య ప్రచారాన్ని మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను నిలిపివేస్తూ తెలంగాణ హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బుధవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకటాయపల్లి వద్ద బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టని అన్నారు.

# సినిమా

## నవ్వించేందుకు మళ్లీ వస్తున్నారు



విశ్వక్‌సేన్ కథానాయకుడిగా తరుణ్‌భాస్కర్ దర్శకత్వంలో ఎనిమిదేండ్ల క్రితం వచ్చిన 'ఈ నగరానికి ఏమైంది' సినిమా ఎంతటి విజయాన్ని అందుకున్నదో తెలిసిందే. కల్ట్ కామెడీ మూవీగా ఆడియన్స్‌ని నుంచి కితాబులందుకున్న ఈ చిత్రానికి సీక్వెల్‌గా రాబోతున్న సినిమా 'ఈఎన్‌ఈ రిపీట్'. విశ్వక్‌సేన్, అభినవ్ గోమటం, వెంకటేశ్ కాకుమాను, శ్రీనాథ్ మాగంటి కలిసి నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నది. సృజన్ యరబోలు, సందీప్ నాగిరెడ్డి నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ థాయిలాండ్‌లో జరుగుతున్నది. నెలరోజుల పాటు ఈ షెడ్యూల్ సాగుతుందని మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన స్టిల్‌లో వింటేజ్ కన్వర్టిబుల్ కారులో హాయిగా కూర్చుని, ఎంతో ఉత్సాహం కనిపిస్తున్న విశ్వక్, అభినవ్ గోమటం, వెంకటేశ్ కాకుమానులను చూడొచ్చు. ఈ చిత్రానికి కెమెరా: ఏజే ఆరోల్, సంగీతం: వివేక్ సాగర్.

## ప్రియాంక చోప్రా 'సిటాడెల్ 2' వచ్చేస్తోంది..




గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రలో నటించిన యాక్షన్ సిరీస్ 'సిటాడెల్' రెండో సీజన్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రైమ్ వీడియో శుభవార్త చెప్పింది. ఈ స్పై థ్రిల్లర్ సిరీస్ సీజన్ 2 విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. యాక్షన్ ప్యాక్డ్ ట్రైలర్‌ను విడుదల చేస్తూ, 2026 మే 6న అన్ని ఎపిసోడ్లను ఒకేసారి ఓటీటీలో రిలీజ్ చేయనున్నట్లు తెలిపింది.

ప్రపంచవ్యాప్తంగా 240కి పైగా దేశాల్లో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. "కొత్త టీమ్. కొత్త మిషన్. సిటాడెల్ కొత్త సీజన్. మే 6న కేవలం ప్రైమ్ వీడియోలో" అంటూ మేకర్స్ సోషల్ మీడియాలో ఈ విషయాన్ని పంచుకున్నారు. మొదటి సీజన్ కథకు కొనసాగింపుగా సీజన్ 2 ఉండనుంది. శక్తివంతమైన కుటుంబాల అండతో నడిచే మాంటికోర్ అనే సంస్థ చేతిలో నాశనమైన 'సిటాడెల్' అనే గూఢచార సంస్థ ఏజెంట్ల కథే ఇది. మాంటికోర్ నుంచి కొత్త ముప్పు ఎదురవ్వడంతో, మాజీ ఏజెంట్లయిన మేసన్ కేన్ (రిచర్డ్ మ్యాడెన్), నదియా సిన్హ్ (ప్రియాంక చోప్రా), బెర్నార్డ్ ఓర్లిక్ (స్టాన్లీ టుస్సి) మళ్లీ రంగంలోకి దిగుతారు. ఈసారి మానవాళి భవిష్యత్తును మార్చేసే ఓ కుట్రను ఆపేందుకు, ప్రపంచవ్యాప్తంగా కొత్త ఏజెంట్లను నియమించుకుని ఒక టీమ్‌ను సిద్ధం చేసే మిషన్‌ను వీరు చేపడతారు. మొదటి సీజన్‌లో కనిపించిన లెస్లీ మ్యాన్‌విల్, యాష్లీ కమింగ్స్ వంటి వారు ఈ సీజన్‌లోనూ కొనసాగనున్నారు. వీరితో పాటు మెర్లే డాండ్రిడ్జ్, గాబ్రియేల్ లియోన్ వంటి కొత్త నటీనటులు కూడా చేరారు. రూసో బ్రదర్స్‌కు చెందిన ఏజీబీవో, అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ ఈ సిరీస్‌ను నిర్మించాయి. డేవిడ్ వెయిల్ షోరన్నర్‌గా వ్యవహరిస్తున్నారు.

## సుకుమార్ రేంజ్‌లో.. పెద్ది స్పెషల్ సాంగ్!





టాలీవుడ్ యాక్షన్ డ్రామా పెద్ది సినిమాపై అంచనాలు రోజురోజుకూ ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇప్పటికే పెద్ది షాట్, పెహిల్వాన్ టీజర్, సాంగ్స్‌తో ప్రకంపనలు సృష్టించిన ఈ సినిమా, ఇప్పుడు ఒక హాట్ అప్‌డేట్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. గత కొద్ది రోజులుగా ఇండస్ట్రీ వర్గాల్లో, సోషల్ మీడియాలో ఒకటే చర్చ.. పెద్ది సినిమాలో స్పెషల్ సాంగ్ చేసే ఆ లక్కీ బ్యూటీ ఎవరా అని..!

ఈ ఒక్క పాట కోసం మేకర్స్ పడ్డ తర్జనభర్జనలు అన్నీ ఇన్నీ కావు. ముందుగా సీతారామం ఫేమ్ మృణాల్ ఠాకూర్ పేరు వినిపించింది. ఆ తర్వాత బుట్టబొమ్మ పూజా హెగ్డే (గ్రాశీశీయిఖ ఎవస్త్రఎవ) రాబోతోందని టాక్ నడిచింది. ఆ తరువాత బాలీవుడ్ బ్యూటీ అయేషా ఖాన్ (ూఎవంష్ట్రు ఖష్ట్రుఅ), అందాల సుందరి మానస వారణాసి పేర్లు కూడా పరిశీలనలోకి వచ్చాయి. ప్రతి ఒక్కరికీ సుపరిచితమైన ఈ స్టార్ హీరోయిన్లందరినీ కాదని, మేకర్స్ ఇప్పుడు ఒక సెన్సేషనల్ ఛాయిస్‌ను ఎంచుకున్నారు. గోల్డెన్ లెగ్ గా పేరు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ సంయుక్త మీనన్ ఇప్పుడు పెద్ది స్పెషల్ సాంగ్‌లో తన గ్లామర్ పవర్ చూపించడానికి సిద్ధమైపోయింది. విరూపాక్ష, బింబిసార వంటి సినిమాలతో మెప్పించిన ఈ మలయాళ బ్యూటీ, మొదటిసారి ఇలాంటి పక్కా మాస్ నంబర్‌లో కనిపించబోతుండటం విశేషం. ఈ సినిమా రిలీజ్ డేట్ మార్చి నుంచి ఏప్రిల్‌కు, అక్కడి నుంచి జూన్‌కు మారుతూ వస్తున్నా, అవుట్‌పుట్ విషయంలో దర్శకుడు ఎక్కడా కాంప్రమైజ్ కావడం లేదు. సినిమా షూటింగ్ దాదాపు పూర్తయిపోయింది. కేవలం ఈ స్పెషల్ సాంగ్ మాత్రమే మిగిలి ఉంది. ఈ పాట కోసం హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను డిజైన్ చేశారట. కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన ఈ సెట్‌లో, సంయుక్త మీనన్ తన స్టెప్పులతో రచ్చ చేయబోతోంది. ఈ వారంలోనే ఈ పాట సెట్స్‌పైకి వెళ్లనుందని సమాచారం. ఆ వెంటనే ప్రమోషన్ల మీద ఫోకస్ పెట్టాలని చిత్ర యూనిట్ భావిస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సన.. లెక్కల మాస్టర్ సుకుమార్ శిష్యుడన్న సంగతి మనకు తెలిసిందే. సుకుమార్ సినిమాల్లో 'ఊ అంటావా మావా' లేదా 'రింగ రింగ' వంటి పాటలు ఏ రేంజ్ లో హిట్ అవుతాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇప్పుడు తన గురువు బాటలోనే బుచ్చిబాబు సన కూడా ఈ పాటను సినిమాకే హైలైట్‌గా ప్లాన్ చేశారు. ఈ పాట థియేటర్లలో ప్రేక్షకులను సీట్ల నుంచి లేచి డాన్స్ చేసేలా చేస్తుందని, అలాగే సినిమా కథలో ఈ పాట చాలా కీలకం కాబోతోందని సమాచారం. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సంయుక్త మీనన్ గ్లామర్ పెద్ది సినిమాకు మరో బూస్టప్‌గా మారనుంది. మరి ఈ మలయాళ బ్యూటీ తన మాస్ యాంగిల్‌తో టాలీవుడ్‌ను ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి!

## శివాత్మిక రాజశేఖర్ బర్త్ డే సర్ ప్రైజ్..

## అశోక్ గల్లా సినిమాలో అదిరిపోయే రోల్!



టాలీవుడ్ వెండితెరపై తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న నటి శివాత్మిక రాజశేఖర్. 'దొరసాని' సినిమాతో పద్ధతైన తెలుగు అమ్మాయిగా పరిచయమై, తన సహజసిద్ధమైన నటనతో అనతి కాలంలోనే విమర్శకుల ప్రశంసలు అందుకుంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ఆస్కారం ఉన్న వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ తండ్రికితగ్గ తనయగా పేరు తెచ్చుకుంటోంది. ప్రస్తుతం యంగ్ హీరో అశోక్ గల్లా సరసన 'వింటారా సరదాగా' చిత్రంలో ఆమె ఒక కీలక పాత్ర పోషిస్తోంది. గత కొద్ది రోజులుగా ఆమె ఈ సినిమాలో నటిస్తుందన్న వార్తలుసోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నా, మేకర్స్ మాత్రం చాలా సస్పెన్స్ మెయింటైన్ చేస్తూ వచ్చారు. కానీ, తాజాగా శివాత్మిక పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు వెల్కమ్ చెబుతూ అధికారికంగా కన్ఫర్మ్ చేయడంతో అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఇక హీరో అశోక్ గల్లా కూడా ఆమెకు విషెస్ చెప్పడం విశేషం. కాగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఎప్పుడూ కంటెంట్ విషయంలో రాజీ పడవు. అలాంటి బ్యానర్‌లో శివాత్మిక లాంటి టాలెంటెడ్ నటి ఒక ముఖ్య పాత్రకు ఎంపికైందంటే, ఖచ్చితంగా ఆ క్యారెక్టర్‌లో ఏదో గొప్ప విషయం ఉండే ఉంటుంది. విజయ్ బుల్గానిన్ మెలోడీస్ లో శివాత్మికపై చిత్రీకరించే పాటలు కూడా సినిమాకు మేజర్ హైలైట్ కానున్నాయి. మొత్తానికి, 'వింటారా సరదాగా' టీమ్ శివాత్మికను బర్త్ డే సర్ ప్రైజ్‌తో ఫుల్ జోష్‌లోకి తీసుకువచ్చారు. వెండితెరపై ఆమె తన నటనతో మరోసారి మ్యాజిక్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. కాగా.. ఈ చిత్రాన్ని ఉద్భవ్ రఘు తెరకెక్కిస్తుండగా.. శ్రీగౌరి ప్రియ అశోక్ గల్లా సరసన హీరోయిన్‌గా నటిస్తోంది.

## చిరుతో బాబీ సినిమా.. నెగెటివ్ రోల్‌లో డింపుల్ హయతి

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద 'వాల్తేరు వీరయ్య'తో మ్యాజిక్ చేసిన మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి మళ్ళీ చేతులు కలిపారు. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులను ముగించుకుని షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, బాలీవుడ్ నటుడు అనురాగ్ కశ్యప్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి. ఇక ఈ సినిమాలో చిరు సరసన ప్రియమణి హీరోయిన్‌గా నటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాగా, ఈ చిత్రానికి సంబంధించి తాజాగా వినిపిస్తున్న ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది.

ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం బోల్డ్ బ్యూటీ డింపుల్ హయాతిని ఎంపిక చేసినట్లు సమాచారం. సాధారణంగా డింపుల్ హయాతి అంటే గ్లామర్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్. కానీ బాబీ ఈ సినిమాలో ఆమెను సరికొత్తగా చూపించబోతున్నారట. ఇందులో ఆమె హీరోయిన్ కాదు అని, నెగిటివ్ షేడ్స్ ఉన్న ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తుందని తెలుస్తోంది. మెగాస్టార్ వంటి దిగ్గజ నటుడికి ఎదురు నిలిచే పాత్ర కావడంతో డింపుల్ రోల్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోందట. ఈ డిఫరెంట్ కాస్టింగ్ సినిమాకు పెద్ద ప్లస్ అవుతుందని ఫిలిం నగర్ వర్గాలు భావిస్తున్నాయి. కమెగాస్టార్ ఒక సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారని, బాబీ ఈ పాత్రను చాలా స్టైలిష్‌గా డిజైన్ చేశారని టాక్.



## కొత్త గృహంలోకి ప్రవేశించనున్న బన్నీ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో తన క్రేజ్‌ను రోజు రోజుకు పెంచుకుంటూ, సంపాదనలోనూ కొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. 'పుష్ప' సినిమాతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న ఆయన, సినిమాల ద్వారా మాత్రమే కాకుండా బ్రాండ్ ఎండార్స్‌మెంట్లు, భారీ రెమ్యునరేషన్లతో టాలీవుడ్‌లో అత్యధిక ఆదాయం పొందుతున్న నటులలో ఒకరిగా నిలిచారు. ఈ విజయాలకి తగ్గట్టుగానే ఆయన జీవనశైలిని కూడా విలాసవంతంగా తీర్చిదిద్దుకుంటున్నారు. ఇప్పటికే సినీ రంగంలోనే కాకుండా వ్యాపార రంగంలో కూడా అడుగుపెట్టిన బన్నీ, 'అల్లు స్టూడియోస్' నిర్మాణంతో తన విజన్‌ను చూపించారు. ఇప్పుడు అదే స్థాయిలో తన వ్యక్తిగత జీవితంలో కూడా ఓ భారీ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన ప్రాంతమైన జూబ్లీహిల్స్‌లో ఆయన నిర్మిస్తున్న కొత్త మేన్షన్ ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ లగ్జరీ హౌస్ సుమారు 4 వేల చదరపు గజాల విస్తీర్ణంలో నిర్మితమవుతోంది. అత్యాధునిక సదుపాయాలు, ప్రీమియం ఇంటీరియర్స్, ప్రత్యేక డిజైన్‌లతో ఈ ఇంటిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఈ మేన్షన్ నిర్మాణానికి దాదాపు రూ. 80 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇది పూర్తయితే జూబ్లీహిల్స్‌లోనే అత్యంత ఖరీదైన మరియు స్టైలిష్ ఇళ్లలో ఒకటిగా నిలవనుంది. ఈ మేన్షన్ మరో ప్రత్యేకత ఏమిటంటే, ఇది మెగాస్టార్ చిరంజీవి నివాసానికి సమీపంలోనే ఉండటం. సినీ కుటుంబం మధ్య ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించేలా ఈ ఇంటి లొకేషన్ కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రస్తుతం ఈ నిర్మాణం తుదిదశకు చేరుకోగా, ఈ ఏడాది చివర్లో అల్లు అర్జున్ తన కుటుంబంతో కలిసి గృహప్రవేశం చేయనున్నట్లు తెలుస్తోంది. అల్లు అర్జున్ నిర్మిస్తున్న ఈ కొత్త మేన్షన్ కేవలం ఒక ఇల్లు మాత్రమే కాదు.. ఆయన సాధించిన విజయాలకు ప్రతీకగా నిలిచే ఒక ల్యాండ్‌మార్క్‌గా మారబోతోందని అభిమానులు భావిస్తున్నారు.

## సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులు వేగవంతం చేసి

# వర్షాకాలానికే గోదావరి జలాలు అందించాలి

### అధికారులు అలసత్వం వీడి పనులు ముమ్మరం చేయాలి
### గోదావరి జలాలతో ఉభయ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయి
### సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి): సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లో భాగమైన సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులను వేగవంతం చేసి రాబోయే వర్షాకాలానికి సత్తుపల్లి ఆయకట్టుకు గోదావరి జలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం సత్తుపల్లి నియోజకవర్గంలోని యతల కుంటలో ఉమ్మడి జిల్లా అధికారులతో కలిసి, అశ్వరావుపేట శాసన సభ్యులు జారే ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ముందుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు నుంచి యతలకుంట వరకు సాగుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జులు, రోడ్డు క్రాసింగ్లు, కాలువ పనుల అమలులో ఉన్న లోపాలు, సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేసి, ఎక్కడా నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా పర్యవేక్షణను మరింత పెంచాలని సూచించారు అనంతరంజరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారులు అలసత్వాన్ని విడిచిపెట్టి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా సుమారు 43 కిలోమీటర్ల పొడవున 1.46 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనులు చేపట్టిందన్నారు. మొత్తం రూ.700 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకు సుమారు రూ.600 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. యతలకుంట టర్మినల్‌కు సంబంధించిన మొత్తం 1.78 కిలోమీటర్ల పనుల్లో చివరి 30 మీటర్ల పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరిలో వరదలు వచ్చేలోపు టర్మినల్ ఎగువ భాగంలోని స్ట్రక్చర్ నంబర్లు 5 నుంచి 10 వరకు ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మే నెలాఖరులోగా అసంపూర్తిగా ఉన్న అన్ని స్ట్రక్చర్ల పనులను పూర్తి చేయాలని, వర్షాకాలానికి ముందే టన్నెల్ ఎగువ భాగంలో ఉన్న ఆరు స్ట్రక్చర్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులు పూర్తిగా మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. కోర్టు కేసులు లేదా భూసంబంధిత సమస్యల కారణంగా ఎక్కడైనా పనులు ఆలస్యమైతే వెంటనే జిల్లా కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. చిన్నచిన్న భూ సమస్యల కారణంగా పనులు నిలిచిపోవడం సమంజసం కాదని, రైతులతో చర్చించి సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యలను సమయానికి తెలియజేయకుండా పనులు నిలిపివేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భూసేకరణలో కొన్ని సమస్యలు, అవసరమైన అనుమతులు ఇంకా పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ వాటిని త్వరితగతిన పరిష్కరించి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కోర్టు కేసుల కారణంగా మరో ఒక కిలోమీటర్ కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆయకట్టు ఖమ్మం జిల్లా పరిధిలో ఉండగా, నిర్మాణ పనులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో కొనసాగుతున్నందున ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అటవీ, పోలీస్ శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఒక్క కిలోమీటర్ పనుల కోసం వేల కోట్ల వ్యయం జరుగుతున్న ఈ ప్రాజెక్టులో చిన్న కారణాల వల్ల పనులు నిలిచిపోవడం సరికాదని మంత్రి స్పష్టం చేశారు. ఏ సమస్య వచ్చినా వెంటనే జిల్లా కలెక్టర్లు లేదా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. యతలకుంట టన్నెల్ నిర్మాణంపై గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్ణయం తీసుకుని కేవలం రెండు సంవత్సరాల్లో టన్నెల్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రత్యేక దృష్టి పెట్టి అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి రాత్రింబవళ్లు పని చేసి ఈ సీజన్‌లోనే నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజీవ్ కాలువ స్టెబిలైజేషన్ ద్వారా ఇప్పటికే సుమారు 1.35 లక్షల ఎకరాలకు నీరు అందించామని మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం నాగార్జునసాగర్ జలాలు అందక పోయినా వైరా ఆయకట్టు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి మండలాలకు గోదావరి జలాలను మళ్లించే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా సత్తుపల్లి ట్రంక్ కాలువ ద్వారా వేంసూరు, దమ్మపేట మండలాలకు కూడా నీరు అందించే అవకాశముందని అన్నారు. నాలుగో పంప్ హౌస్ పనులు పూర్తి అయితే వచ్చే సంవత్సరం అశ్వరావుపేట, దమ్మపేట మండలాలకు గోదావరి జలాలు అందించవచ్చని తెలిపారు. దీంతో మొత్తం 110 కిలోమీటర్ల మేర కాలువ వ్యవస్థ పూర్తవుతుందని, మెయిన్ కాలువతో పాటు మూడు పంప్ హౌస్‌లను వినియోగించి గోదావరి జలాలను ఉభయ జిల్లాల్లోని 8 నియోజకవర్గాలకు సరఫరా చేసే అవకాశం కలుగుతుందని అన్నారు. పాలేరు ప్రాంతానికి గోదావరి జలాలు చేరాలంటే జూలూరుపాడు టన్నెల్ పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దానిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అలాగే ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉభయ జిల్లాల్లోని మధ్య తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులకు నీరు అందించడమే కాకుండా మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేసి పినపాక నియోజకవర్గంలో 16,500 ఎకరాలకు నీరు అందించే లక్ష్యంతో ఉన్నామని తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తేనే ప్రాజెక్ట్‌ను నిర్దేశిత కాలంలో పూర్తి చేసి ఉభయ జిల్లాలను సస్యశ్యామలంగా మార్చగలమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు,ఉభయ జిల్లాల ఇంజనీరింగ్ ఇరిగేషన్ పోలీస్ ఫారెస్ట్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ ప్రీస్కూల్ చిన్నారులకు ఏకరూప దుస్తుల పంపిణీ

### పౌష్టికాహారం,పాఠ్యపుస్తకాలను అందజేసిన మంత్రి సీతక్క



ములుగు, ఏప్రిల్22 (తెలంగాణ వాణి) ములుగు జిల్లా మంగపేట గ్రామ పరిధిలోని శాంతినగర్ గుత్తి కోయగుంపులోని అంగన్వాడీ చిన్నారులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి,సరఫరా,మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎన్. తో కలిసి అదనపు జత ఏకరూప దుస్తులను,మూడేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం 'బాలామృతం', ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పిల్లలను పనిచేసే ప్రదేశాలకు తీసుకెళ్లవద్దని సూచించారు. గుత్తి కోయ ఆవాసంలోని పిల్లలు సక్రమంగా అంగన్వాడీ కేంద్రానికి హాజరవుతూ ఆటపాటలతో కూడిన ప్రీ-ప్రైమరీ విద్యను అభ్యసించాలని కోరారు అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం, ప్రీ-స్కూల్ విద్య ప్రభుత్వం అందిస్తుందని, ప్రతి చిన్నారి శారీరక, మానసిక వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు.

### కోర్టు తీర్పుతో కాంగ్రెస్, బీజేపీలకు కనువిప్పు కలగాలి : మాజీ మంత్రి

మహబూబ్‌నగర్ : కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎటువంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్ట్ ఆదేశించడంతో న్యాయం గెలిచిందన్నారు.కోర్టు తీర్పుతో నైనా కాంగ్రెస్, బీజేపీలకు కనువిప్పు కలగాలని అన్నారు. తెలంగాణను సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్ట్ పై కాంగ్రెస్,బీజేపీలు అడ్డగోలుగా విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందారని విమర్శించారు. కేసీఆర్( ఖజ= ) ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. కానీ న్యాయ స్థానాలపై నమ్మకంతో కేసీఆర్ ,హరీష్ రావు పోరాడగా చివరకు నిజం గెలిచిందన్నారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ రాజకీయ కక్షలు, వేధింపులు మానుకోవాలని హితవు పలికారు. పాలనపై దృష్టి సారించాలని సూచించారు.

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సదన్ మహరాజ్



హుస్నాబాద్ ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి ఆర్ సి): రాష్ట్రం వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ధర్మసమాజ్ పార్టీ, బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంపూర్ణ మద్దతును తెలియజేస్తున్న సందర్భంలో హుస్నాబాద్ ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె దీక్షా శిబిరంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సదన్ మహారాజ్ పాల్గొని పూర్తి మద్దతును ప్రకటించడంజరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం చొరవ తీసుకొని చర్చలు జరిపి పరిష్కరించాలని అన్నారు. ఆర్టీసీ కార్పొరేషన్ ని ప్రభుత్వంలో విలీనం చేయాలని, అందులో పని చేస్తున్న వారందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పెండింగ్లో ఉన్న ఏరియర్స్ విడుదల చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని చేస్తున్న డిమాండ్లు న్యాయ పరమైనవని అదేవిధంగా ధర్మ బద్ధమైనవని, అవేమీ గొంతెమ్మ కోరికలు కావని అన్నారు ప్రజాపాలన అని గొప్పలు చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం ప్రజలకు నిరంతరం సేవ చేస్తున్నటువంటి ఆర్టీసీ కార్మికులకు ఉన్నటువంటి ఇబ్బందుల్ని ఎందుకు పరిష్కరించలేక పోతుందని ప్రశ్నించారు.. త్వరితగతిన ఆర్టీసీ ఉద్యోగులతో చర్చలు చేసి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, సమ్మెను విరమింపజేసి ప్రజా రవాణా పునరుద్ధరించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని లేనిపక్షంలో ప్రభుత్వం యొక్క వైఫల్యాన్ని క్షేత్రస్థాయిలో ఎండగడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోధర్మ సమాజ్ పార్టీ నాయకులు ఎల్లన్న, ఐలేష్, ప్రవీణ్, భిక్షు, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్ హామీకి కార్యరూపం

### మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ చేసిన మంత్రి సీతక్క
### రాయినిగూడెం, దోమేడ గ్రామాలకు చెందిన 25మంది మహిళలకు లబ్ధి



ములుగు ఏప్రిల్22 (తెలంగాణ వాణి) 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ములుగు జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వ హిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు, మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ శనివారం ములుగు మండలం రాయినిగూడెం గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో స్థానిక మహిళలు తమ సమస్యను విన్నవించారని తెలిపారు. కుట్టు మిషన్ నేర్చుకున్నప్పటికీ మిషన్లు లేకపోవడంతో ఉపాధి పొందలేక ఇబ్బంది పడుతున్నామని, కుట్టు మిషన్లు అందిస్తే ఉపాధి దొరుకుతుందని వారు కోరారని చెప్పారు.వెంటనే స్పందించిన మంత్రి సీతక్క రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహాయ సహకారంతో రాయినిగూడెం గ్రామానికి చెందిన పది మంది మహిళలకు, మంగపేట మండలం దోమేడ గ్రామానికి చెందిన 15 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు.ప్రభుత్వ నిధులను అభివృద్ధి పనులకు కేటాయించడంతో పాటు మహిళల స్వయం ఉపాధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. పేద మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు విస్తరాకుల తయారీ యంత్రాలు, గ్లాసుల తయారీ యంత్రాలు, కుట్టు మిషన్లు వంటివి దాతల సహకారంతో అందిస్తున్నామని వివరించారు.సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి కుట్టు మిషన్లను విరాళంగా అందించిన రోటరీ క్లబ్ ప్రతినిధి చంద్రమౌళి ఇతర దాతలకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రంథాలయ షాపుల అక్రమాలపై

# విచారణ జరిపించాలి

### తెలంగాణ జన సమితి అధ్యక్షులు ఖాదర్ పాష



వనపర్తి : ఏప్రిల్ 22, (తెలంగాణ వాణి ప్రతినిధి) వనపర్తి జిల్లా కేంద్రంలోని శంకర్ గంజ్ లో ఉన్న లైబ్రరీకి చెందిన షాపుల టెండర్ల విషయంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను విచారించి చర్యలు తీసుకోవాలని తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్ భాషా కోరారు.శంకర్ గంజ్ (వనపర్తి పట్టణం) లైబ్రరీ కాంప్లెక్స్ ?ఇక్కడి రెండు షాపుల అద్దె కాలపరిమితి డిసెంబర్ 2025తో ముగిసింది. ?ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి 5 ఏళ్లకు ఒకసారి టెండర్లు పిలవాలి, కానీ గత 25 ఏళ్లుగా టెండర్లు పిలవకుండా పాత వారికే అతి తక్కువ అద్దెకు కొనసాగిస్తున్నారు.ఇందులో లైబ్రరీ అధికారులు (వెంకటయ్య, తేజలు) షాపు అద్దెదారులతో కుమ్మక్కై లైబ్రరీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపణ ఉన్నాయి. కొత్తకోట లైబ్రరీ కాంప్లెక్స్ ?ఇక్కడ 3 షాపులు ఉన్నాయి. వీటి టెండర్ గడువు 2 ఏళ్ల క్రితమే ముగిసింది.?గడువు ముగిసినా కొత్త టెండర్లు పిలవకుండా, వస్తున్న అద్దెను లైబ్రరీ ఖాతాలో జమ చేయకుండా అధికారులు వ్యక్తిగతంగా వాడుకుంటున్నారు. ఈ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.?వెంటనే బహిరంగ టెండర్లు పిలిచి, లైబ్రరీలకు రావలసిన ఆదాయాన్ని కాపాడాలి. గతంలో టిఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా గ్రంథాలయం పైన ఖండించాం కానీ ఆ ప్రభుత్వంలో స్పందన లేనందున ఇప్పుడు మన ప్రజా ప్రభుత్వం ఉన్నందున గ్రంథాలయానికి వచ్చే ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకొని అవినీతిని అరికట్టాలని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ఖాదర్ పాష అధికారులను కోరారు. తక్షణమే గ్రంథాలయం అవినీతిపరులు పైన విచారణ చేయాలని కోరుతూ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మాజీ మంత్రి సంఘీభావం



జగిత్యాల: ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి ప్రతినిధి): జగిత్యాల బస్ డిపో వద్ద ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేశ్ కలిసి పాల్గొన్నారు. అర్ధరాత్రి నుండి సమ్మె సైరన్ ప్రకటించిన ఆర్టీసీ కార్మికులు జగిత్యాల డిపో ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి దావ వసంతతో కలిసి మద్దతు ప్రకటించారు. అనంతరం జీవన్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులకు ఈ పరిస్థితి రావటం బాధాకరం అని అన్నారు. ఏ కార్మికుడు కూడా సమ్మెకు పోవాలని కోరుకోడన్నారు. తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర ఏర్పాటుకు అండగా నిలిచింది కార్మికులు అన్నారు. గతంలో కేసీఆర్ పెద్ద మనసుతో సంస్థ ను ప్రభుత్వంలో విలీనం చేస్తాను అని వెల్లడించినట్లు పేర్కొన్నారు.కానీ అంతలోనే ఎలక్షన్ రావడం జరిగిందన్నారు.ఈ ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఆర్టీసీ కార్మికులకు అన్ని రకాలుగా ఆదుకుంటాం అని తెలిపిందన్నారు. ఈ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని,మహాలక్ష్మి పథకం అమలు అవుతున్నదానికి కారణం ఆర్టీసీ సంస్థ అని వెల్లడించారు. 5 డి ఏ లు పెండింగ్ లో ఉన్నాయని,2021,2025 పిఆర్సీ అమలు చేయాలన్నారు. సంస్థలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉందన్నారు.బసుల సంఖ్య పెంచకుండా మహిళలకు మహాలక్ష్మీ పథకం ను నిర్వహిస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డి కి జ్ఞానం ఉందా అని,మేనిఫెస్టో ఎన్నికల ప్రణాళికను ప్రభుత్వం చదువుకోవాలన్నారు. సమ్మె పరిష్కారం లభిస్తుంది అనుకున్న.. తీసుకున్న నిర్ణయం గొప్పదని, తాము మీకు అండగా ఉంటాం తోడుగా ఉంటామని జీవన్ రెడ్డి తెలిపారు.ఆర్టీసీ సంస్థ కి నిధులు పూర్తి స్తాయిలో విడుదల చేయాలని, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే విధంగా అపాయింట్ డే ప్రకటించాలన్నారు. ఈ ప్రభుత్వంలో సమ్మె అనివార్యం అయ్యిందని, ఇవాళ యూనియన్ ల పునరుద్ధరణ అవసరం పడినదని తెలిపారు.రవాణా సదుపాయాలు మెరుగుపర్చాలి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యల గురించి పాటుపడుతానన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com